
# స ర్వ  స మ ర్దు డు



సేకరణ : మూర్ఖబాలుడు

ప్రతులకు : శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్టు
గొలగమూడి
నెల్లూరు జిల్లా - **524 321**

## ఓమ్

మన జీవిత సంఘటనలను శాసించే దైవశక్తి ఒకటున్నది అనే ధృఢమైన నమ్మకమున్నప్పుడే మానవుడు సత్యం, ధర్మం అంటి పెట్టుకొని వాటి ద్వారా సంపన్నత్వం, సాధారణత్వం గల్గి సద్గురు సేవచేస్తాడు. అట్టి ధృఢమైన నమ్మకమున్నవారు ఎన్ని కష్టాలు వచ్చినా, తన వాళ్ళు తనకు దూరమైనా తన సత్య, ధర్మ మార్గమునుండి కించిత్తయినా ప్రక్కకు తొలగరు. జీవిత సంఘటనలను శాసించే దైవశక్తి ఉన్నదనే ధృఢమైన నమ్మకాన్ని ఎందరికో ఆ దైవం ప్రసాదిస్తున్నా, ఆశను వదిలిన పుణ్యాత్ములే సత్య, ధర్మ మార్గంలో స్థిరంగా నిలువగలిగి నిరవధిక ఆనందాన్ని అనుభవిస్తున్నారు. గనుక మన ఆశయే మన ఆనందానికి అడ్డని ఎరిగి దానిని వదలుటే మన కర్తవ్యము. దానినే శ్రీ వెంకయ్య స్వామి వారు "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా" అన్నారు. శ్రీ స్వామి వారి ద్వారా దైవశక్తికి నిరూపణ పొందిన పుణ్యాత్ముడే పి.యాదగిరి గారు - స్పెషల్ తహసిల్దారు - క్రిష్ణపట్నం ధర్మల్ పవర్ స్టేషన్ - నెల్లూరు జిల్లా.

### పి.యాదగిరి గారు ఇలా వ్రాస్తున్నారు:

నవంబరు, 1989 సంవత్సరములో నేను సివిల్ సప్లయస్ గోడౌను ఇన్‌చార్జ్‌గా పని చేయుచున్నప్పుడు ఒక అతను శ్రీ సత్యసాయిబాబా గారి భక్తుడు నాతో ఇలా చెప్పు చుండెడివాడు. ఈ నెల్లూరు ప్రక్కన గొలగమూడి అను పుణ్యస్థలమునందు శ్రీ షిర్డి సాయిబాబాతో సమానుడైన స్వామి ఉన్నారు. ఆ స్వామి పేరే గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి. షిర్డిలో బాబా ఏ విధంగా అగ్నిహోత్రము చేసేవారో ఈ

గొలగమూడిలో ఆ విధంగానే శ్రీ శ్రీ శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారు నిత్య అగ్ని హోత్రుడు అని చెప్పేవారు.

నేను రాపూర్‌లో డిప్యూటీ తహసిల్‌దారు సివిల్ సప్లయిస్ గోడౌను ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు - ఆ గోడౌన్‌కు పైన ఆస్‌బెస్టాస్ కప్పు ఉన్నది, కానీ మొత్తము పగిలిపోయిఉన్నది. ప్రతిరోజు మేము బియ్యము కట్టలపై టార్‌పాలిన్ కప్పి సాయంత్రము ఇంటికి వెళ్ళేవారము, నేను మరియు కూలీలు కూడా నవంబరు నెల, 1989 లో ఒకరోజు టార్‌పాలిన్ కప్పడము మరచిపోయినాము. కానీ ఆనాటి రాత్రి 9 గంటలకు అనుకోకుండా కుంభవృష్టి కురిసినది. గాలి వాన విపరీతముగా ఉండడము వలన పవరు కూడా పోయినది. కటిక చీకటి మరియు కుంభవృష్టి, గాలి. ఆ సమయములో కాలు బైట పెట్టడానికి వీలులేని పరిస్థితి. అందువలన గోడౌను వరకు వెళ్ళి బియ్యము కట్టలపై పట్టా కప్పే పరిస్థితి లేదు. ఆ గోడౌను నందు కనీసము 1500 బియ్యము కట్టలు ఉన్నవి. ఈ భీకర వర్షానికి తప్పక గోడౌను నీటిమయము అవ్వక తప్పదు. ఏమి చేయాలో ఏమీ తోచక వెంటనే శ్రీ శ్రీ శ్రీ అవధూత వెంకయ్య స్వామి జ్ఞాపకానికి వచ్చి స్వామితో ఈ విధమైన ప్రార్థన జరిపినాను "దేవుడా నా గోడౌనుకు సరియైన కప్పులేదు ఈ వర్షానికి - ఈ తుఫానుకు నా గోడౌను మొత్తము తడచిపోతుంది. మొత్తము బియ్యం కట్టలు వర్షము నీటితో తడచి పోతాయి, కావున రేపు నా ఉద్యోగము పోతుంది. నా జీవితము వ్యర్థమై పోతుంది. అందువలన నీవు నిజంగా దేవుడివైతే నన్ను, నా గోడౌనును రక్షించు స్వామి. నా గోడౌనులో ఏ మాత్రము ఒక్క చుక్క నీరు పడకుండా కాపాడు స్వామి, నాకు నీవు తప్ప వేరే దిక్కులేదు. నీవు గోడుగు పడతావో లేక మందగిరి పర్వతము ఎత్తి కాపాడుతావో నీ దయ స్వామి. ఏది ఏమైనా నా గోడౌనులో బియ్యం తడవకుండా చూడు స్వామి. రేపు తెల్లవారి ముఖముగూడా కడుగుకోకుండా నీ ఆశ్రమము ఎక్కడున్నదో



వెతుకుతూ వచ్చి మీ దర్శనము చేసుకుంటాను స్వామి" అనుకుంటూ తెల్లవారి 5 గంటల వరకు కంటికి కునుకుగూడా లేకుండా దు:ఖముతో ప్రార్థించుచునే ఉన్నాను. తెల్లవారి 5 గంటలకు వర్షము తగ్గుముఖము పట్టింది. అప్పుడు ఇంటిలో నుండి బయలుదేరి రాపూరు తాలూకా ఆఫీసులో ఉన్న గోడౌను చేరినాను. గుండె గుబేలుమన్నది. ఎచ్చట చూచిన పెద్ద పెద్ద చెట్లు ఆ గాలి, వర్షానికి పడిపోయి వున్నవి. మరియు మోకాలు నుండి నడుములోతు వరకు వర్షము నీరు నిండి ఉన్నది. అయినను గోడౌను వరకు దగ్గరికిపోయి చూచి తలుపులు తెరచి చూస్తే నా గోడౌను, నా ఆఫీసు రూమ్ తప్ప అంతటా వర్షము నీటితో నిండి ఉన్నది, కానీ గోడౌను మరియు నా ఆఫీసురూమ్‌లో మాత్రము కనీసము గోడలుగూడా తడవలేదు. చిత్రాతి చిత్రము, మహా అద్భుతము. గోడౌను కప్పంతా పగిలిపోయిఉంది. గోడౌను బయట గజంలోతు నీళ్ళుంటే గోడౌనులో చుక్క నీరులేవంటే అది నా దేవదేవుడు భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి వారు నా ప్రార్థనను ఆలకించి, ఎంతో ప్రేమతో దయతో నన్ను, నా గోడౌనును కాపాడమని వరుణదేవుడికి చెప్పినాడో లేక రెండు చేతులను కప్పినాడో, గొడుగే పట్టినాడో, లేక ఆ మందగిరి పర్వతాన్నే ఎత్తినాడో, ఏమి చేసినాడో - స్వామి మొత్తము మీద నన్ను, నాగోడౌనును రక్షించినాడు. కావున ఇది కేవలము సర్వ సమర్థుడు, సర్వశక్తిమయుడు అయిన ఆ సర్వేశ్వరుడికి తప్ప అన్యులకు సాధ్యము అయ్యే పని కాదు. కావున శ్రీ వెంకయ్యస్వామి అవధూతయే కాదు సాక్షాత్ పరమాత్మ స్వరూపుడు. పరబ్రహ్మ స్వరూపుడు. నా మొర ఆలకించి నన్ను కాపాడిన దేవదేవుడే తప్ప అన్యముకాదు. ఆ ఏడేడు పద్నాలుగు భువనముల నేలు శ్రీ వెంకయ్యస్వామి తప్ప నన్ను రక్షించినది అన్యము, కానే కాదు. సర్వస్వము తనేయైన మహాశక్తి పాదములకు సహస్రకోటి వందనములు తప్ప ఇంకేమి సమర్పించగలను.

## శ్రీ పి.యాదగిరిగారు స్పెషల్ తహసిల్‌దారుగారు - కృష్ణపట్నం ధర్మల్ స్టేషన్ గారి మరికొన్ని అనుభవాలు (నెల్లూరు కలక్టరు ఆఫీసు).

ఒకరోజు నేను ఆగష్టు 1989 నెల్లూరు ట్రంకురోడ్డులో పోతూ శ్రీ దత్తసాయి మందిరం అనే బోర్డు చూచాను. ఆ సందులో చాలామంది పోతుంటే నేనూ వెళ్ళాను. అక్కడ దిగంబర యోగి ఒకరు కూర్చొని ఉంటే శ్రీమతి దువ్వూరు జయమ్మ ఏదో తినిపిస్తున్నారు. మరొకరు మరొక సేవ చేస్తున్నారు. చాలామంది ఉన్నారు. నేను అక్కడ కూర్చొని ఇలా అనుకున్నాను. ఈ విధంగా వేలం వెర్రిగా పిచ్చివానికి సేవలు చేస్తుంటే ఏమవుతుంది" అని అనుకుంటూ అక్కడే కూర్చున్నాను. అంతమందిలో నన్ను ఆ స్వామి ముందుకు పిలిచి ఏ వూరు, ఏమి చేస్తావోయ్ అన్నారు. నేను కలెక్టరు ఆఫీసులో చిన్న ఉద్యోగం చేస్తాను స్వామి అంటే "ఒరేయ్ నేను పిచ్చివాణ్ణా, జాగ్రత్త" అన్నారు. ఆ మాటతోనే నేను షష్ అయ్యాను. నా మనసులో మాట వీరికెలా తెలిసింది అని ఆశ్చర్యపోయాను. వీరు నిజంగా దేవుడే అని నమ్మాను. వారే శ్రీ రామిరెడ్డి తాతగారు, కర్నూలు. ఇది నా ప్రథమ అనుభవం (శ్రీ తాతగారితో).

మరొకరోజు నేను నెల్లూరు శ్రీ వెంకటరమణ హోటల్ ముందుకు రాగానే పెద్ద పెద్ద అందమైన గులాబీలు ఒక గంపలో పెట్టి అమ్మే ఆమె కనిపించింది. ఇంత అందమైన గులాబీలు దేవుని పాదాలమీద అర్పించబడాలని రెండు గులాబీలు కొని పాల్‌థిన్ కవరులో పెట్టి జాగ్రత్తగా పట్టుకొని హోటల్‌లో టిఫిన్ చేసి బయటకొచ్చి నేను నాయుడుపేటకు వెళ్ళేలోగా భగవంతుడు కనబడితే వారి పాదాల కర్పించాలని బస్సెక్కి వస్తున్నాను. గూడూరు సాయిబాబా మందిరం దగ్గర బస్సాగింది. ఆనాడు గురువారం కాకపోయినా చాలామంది జనం క్రిక్కిరిసి ఉన్నారు. నేను బస్సుదిగి మందిరం గేటులోకి రాగానే



శ్రీ రామిరెడ్డి తాతగారికి స్నానం చేయించి కొత్త బట్టలు కట్టి పాదాలకు పసుపు, కుంకుమ పెట్టి అగ్ని గుండం దగ్గర నిలుచొని నాకొరకే చూస్తున్నారు. అంతమందిలో నన్ను సైగతో పిలచారు. నేను ఆనంద, ఆశ్చర్యాలతో నా చేతిలోని గులాబీలు వారి పాదములపై ఉంచి పాదాభివందనము చేశాను. నేను సమర్పించిన గులాబీలను రెండు పాదాల బొటలవేలు దాని ప్రక్కవేలు మధ్యన ఉంచి పట్టుకొని అలాగే నడుస్తూ మందిరంలో ప్రవేశించారు. గులాబీలు నాయుడుపేట వెళ్ళేలోగా దేవునకే అర్పించాలని నేను తలవగానే గూడూరులో శ్రీ రామిరెడ్డి తాతగారి రూపంలో దర్శనమిచ్చి గులాబీలు స్వీకరించారు. నేను వెళ్ళే బస్సు అక్కడ నిలవడమేమి, నేను బస్సు దిగి వెళ్ళి శ్రీ తాతగారికి గులాబీలర్పించడమేమి? అంతా దైవలీల. - పి.యాదగిరి

## పి.అరవిందాదేవి, హైదరాబాద్ ఇలా వ్రాస్తున్నారు:

2003 సెప్టెంబరు 5, 6 తేదీలలో - నేనూ, మావారు హరిద్వార్ నుండి ఢిల్లీ వెళ్ళటానికి రైలు ఎక్కాము. ఢిల్లీకి 100 కి.మీ. దూరముండగా మావారు స్వామి దారము (రక్షాభందము) రైలుకు కట్టావా అని అడిగారు (నేను రైలెక్కినా, బస్సెక్కినా చివరకు రిక్షా ఎక్కినా కూడా స్వామి దారము కట్టి ఏ ఆపద లేకుండా అందరినీ క్షేమంగా గమ్యము చేర్చు తండ్రీ అని మొక్కుకుంటాను). లేదండి, కడాతాను అని పర్సుతీసి దారము తీయడానికి పర్సు జిప్‌లాగుతుండగా, దడ దడమని శబ్దముతో రైలు అటూ ఇటూ ఊగసాగింది. పైన పెట్టిన లగేజి అంతా అందరిపైనా పడి అందరికి దెబ్బలు తగులుతున్నాయి. ఇంతలో రైలు పెట్టెనిండా నల్లగా పొగ నిండసాగింది. పెట్టెలోని వారందరూ మంటలొస్తాయని గబ, గబా రైలు నుండి దూకేశారు. మా రైలు పెట్టెలో నేనూ, మావారు మాత్రమే మిగిలాము. నేను పర్సునుండి స్వామి దారము తీయలేక

నా చేతికి కట్టివున్న స్వామి దారము తెంచి కిటికీ చువ్వపైవేసి చేతితో దారము చువ్వకేసి అదిమి నారాయణా, నారాయణా రక్షించు తండ్రీ అని వేడుకుంటున్నాను. ఇంతలో పెద్ద శబ్దముతో మా పెట్టె తర్వాత 3 పెట్టెలు పడిపోయాయి. మా పెట్టె చక్రాలు అటూ ఇటూ పడిపోయి పెట్టె ధన్‌మనే శబ్దంతో నేలమీద నిలబడి పోయింది. చుట్టూ గోల గోలగా ఏవేవో అరుపులు వినిపిస్తున్నాయి. రైలుపెట్టెలో నేనూ మావారు తప్ప ఎవ్వరూలేరు. మేమిద్దరము మెల్లగా దిగాము, ప్రతి ఒక్కరికీ రక్తపుగాయాలే, కొంతమంది చనిపోయారు, కొంతమందికి చేతులు కాళ్ళు విరిగాయి. పైనుంచి లగేజి పడి తలకు ముఖాలకు కొందరికి బాగా దెబ్బలు తగిలాయి. ఇంత జరిగినా మా ఇద్దరికీ ఏమీ కాలేదు. వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది అని శ్రీ స్వామి వారన్నమాట ఎంత సత్యమో చూడండి. అంతమందికి ప్రాణ నష్టము, కాళ్ళు చేతులు విరగడం నెత్తురు గాయాలు తగలడం జరిగినా వీళ్ళిద్దరికీ ఏమీ కాలేదంటే శ్రీ స్వామి వారి అభయమే నిజమైంది. సంపూర్ణ విశ్వాసమే కొండలను కదిలిస్తుంది.

పై లీల శ్రీ స్వామి వారి దారం మహిమ అనుకుందామా? ఇంతకుముందు పి.యాదగిరి గారి బియ్యం గోడౌన్ వరుణదేవుని ఆగ్రహం నుండి రక్షించినపుడు దారం ప్రశక్తే లేదు. కనుక ఎప్పుడైనా ఎవరికైనా వారి దయపొందుటకు మన విశ్వాసమే కారణం అని తెలుస్తుంది.

మనలెక్కలో పుణ్యమెక్కువగా ఉంటే అది మనలను శుభ్రమార్గానికి ఎలా నెడుతుందో ఆ మార్గంలో మరలా తప్పులు చేయకుండా మనలను ఎలా కాపాడుతుందో తెలిపేవే శ్రీ డి.నాగేశ్వరరావు, దమ్మపేట వారి అనుభవాలు.



1990-91 సంవత్సరంలో నేను సత్‌సంగానికి పోతూ శ్రీ సాయిని గురించి, శ్రీ మాష్టారిని గురించి కొద్ది కొద్దిగా తెలిసుకునే రోజులు. ఒకరోజు బస్టాండులో ఒక గడ్డమున్న వ్యక్తి బిక్షగానిలాగా నా ప్రక్కన నిలుచున్నాడు. నేను కొంత దక్షిణ ఇచ్చి వంగి నమస్కరిస్తుంటే నా వీపుపై నిమురుచూ నీకొక చెడ్డ గుణం ఉంది. అది నీవు వదలి పెట్టాలి. అప్పుడే నీకు మంచి జరుగుతుంది అని అన్నాడు. ఆ చెడ్డ గుణమేమిటని ఎన్నిమార్లు అడిగినా నీకే తెలుస్తుంది. నేను చెప్పబళ్ళేదని చెప్పి వెళ్ళిపోయాడు.

తర్వాత బాగా ఆలోచించాక నాకే తోచింది. నా తల్లిదండ్రులు స్నేహితులు ఎందరు వద్దని చెప్పినా వినకుండా నేను పేకాట ఆడేవాణ్ణి. అదేమి చిత్రమో కానీ తెల్లవారి నుండి ఈనాటి వరకు మరలా నేను పేకాట మాటే మరచిపోయాను. నా దగ్గర దక్షిణ గ్రహించి నన్నా దురభ్యాసము నుండి భగవంతుడే రక్షించాడు. వారు దీవించినట్లే ప్రతి నిత్యం క్రమం తప్పకుండా సత్‌సంగానికి వెళ్ళడం, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, మహాత్ముల దర్శన ఆశీస్సులు పొందడం, దత్త క్షేత్రాల దర్శనం, మొదలగు ఎన్నో మేళ్ళు పొందుచున్నాను.

03-10-1995 న దశరా పండుగ రోజు మా మామగారు చనిపోతే ఇంటికి తాళం వేసి అందరమూ కామయ్యపాళెం వెళ్ళాము. సాయంత్రం 5 గంటలకు దమ్మపేటలోని మా ఇంట్లో దొంగలు పడ్డారు. వెంటనే రండి అని ఫోను వచ్చింది. నేను వెళ్ళేసరికి ఇంటి చుట్టూ జనం నిండి ఉన్నారు. ఏమేమి పోయాయో చూడమని యస్.ఐ. గారు చెపితే ఇంట్లోకి వెళ్ళిచూచాను. వారు తాళంతో వాకిలి తాళము, బీరువాతాళం తీశారు. అన్నీ సామానులు బంగారు, వెండి, హుండీ తీసి ఇంట్లో ఉంచిన సాయి మందిరం పైకంగానీ ఏదీ ఒక్క పైసాగానీ ఒక్క గుడ్డగానీ, పాత్ర

సామానుగానీ, నగగానీ ఏదీ తీసుక పోలేదు. అన్నీ బీరువా బయటే పెట్టారు. యస్.ఐ. గారు పోతూ నా సర్వీసులో ఈ విధంగా దొంగలు పడి ఏ వస్తువూ తీసుకపోకపోవడం చూడలేదు. ఇది కేవలం దైవ సహాయమేనన్నారు. ఈ సన్నివేశం చూచి అందరూ ఆశ్చర్యపోయారు. వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది, అన్న శ్రీ స్వామివారి మాట యదార్థమైంది. మనం శ్రీ స్వామివారికి చెల్లించే కానుకలు మాత్రమే కాదు. మనం ఆచరించే సత్యం, ధర్మం కూడా వారి కృపను పొందేందుకు మార్గమని తెలుస్తుంది.

నేనొకసారి కురువపురంపోతూ అక్కడ నదిని బుట్ట పడవలో దాటుచున్నాను. నేను ఎక్కే సమయానికే బుట్ట పడవలో బొగ్గులు బస్తాలు మరియు జనంతో నిండిపోయి ఓవర్ లోడ్ అయి ఉంది. బుట్ట పాతది అయినందువల్ల నది మధ్యలోకి వెళ్ళినాక చిల్లిపడి బుట్టలోనికి నీళ్ళు వస్తూ పడవ మునిగిపోతుంది. కనుక బుట్ట నడిపేవాడు బుట్ట మునిగిపోతుంది, ఈత వచ్చినవాళ్ళు మాత్రం బ్రతుకుతారు మిగిలిన వారు చనిపోతారని కేక వేసి నీటిలో దూకాడు. పడవ మునిగి నేను నీటిలో ఉన్నాను. నేను గట్టిగా సాయి గురుదేవా నన్ను కృష్ణా నదిలో మా రాష్ట్రంలో కూడా కాకుండా ముంచేస్తున్నావా స్వామి, నాకు ఈత కూడా రాదు స్వామి, చనిపోవడం ఖాయం. ఏమైనా రక్షించగలిగితే నీవక్కడి వల్ల మాత్రమే అవుతుంది అని నీటిలో మునుగుతూ తేలుతూ, ఏడుస్తూ అనుకున్న తక్షణం బుట్టవాడు నన్ను గట్టిగా పట్టుకొని అమాంతం ఒక బొగ్గులు బస్తాపై పడవేసి గట్టిగా పట్టుకొమ్మన్నాడు. అలానే చేసినాను, ఆ బుట్టువాడు ఒక ఆడకూతురిని ఒడ్డుకు చేర్చేందుకు లాక్కుపోతున్నాడు. బుట్ట అతను వచ్చేవరకు ఈ బొగ్గులు బస్తా, నేను, నీటిలో కొట్టుకుపోతున్నాము. అప్పుడు నా మానసిక స్థితి, దు:ఖము ఎలా ఉంటాయో మీరే ఊహించండి. ఆ బస్తా ఒక పెద్ద బండకు కొట్టుకొని



ఆగిపోవడం విశేషం. నేను బొగ్గులు బస్తాను గట్టిగా కౌగిలించి పట్టుకొన్నాను. ఆ సమయంలో నా దగ్గర గురుచరిత్ర పుస్తకం మరియు టవలు తప్ప మరేమీ లేవు. బుట్టవాడు ఆడమనిషిని ఒడ్డుకు చేర్చి, నా దగ్గరకొచ్చి నన్ను ఒడ్డుకు లాక్కుపోయాడు.

ఈ ప్రమాదంలో 10 వ తరగతి చదివే అమ్మాయి కూడా మరణించింది. నేను చనిపోతున్నానని వణికిపోతున్నాను. గట్టునున్నవారు అయ్యో చనిపోతున్నాడని అరుస్తున్నారు. ఆ బొగ్గులు బస్తా బండకు కొట్టుకొని ఆగకుంటే నేను తప్పక చనిపోవలసింది. దైవమే ఆ రాయి రూపంలో బొగ్గులు బస్తాను ఆపి నన్ను రక్షించారు. నాకు ఆ సమయంలో స్ఫురించింది ఏమంటే ఆపద సమయంలో డబ్బు సాయం చేయలేదు. బంధువులు సాయం చేయలేరు, బాబాగారు, గురువుగారు, శ్రీ వెంకయ్య స్వామి వార్లు మాత్రమే రక్షించగల్గుతారు. స్మృతిమాత్ర ప్రసన్నులు అనటానికి ఇంతకంటే నిదర్శనం ఏంకావాలి. ఇలా నాకు పునర్జన్మను ఇచ్చి కాపాడినారు. ఇప్పటికీ ఆ సంఘటన గుర్తుకొచ్చిన సమయంలో నా కాళ్ళు వణుకుచుండుట విశేషము.

## తప్పులు సరిదిద్దుట

మనం మహనీయులను హృదయపూర్వకంగా సేవిస్తుంటే వారు మన తప్పులనెలా సరిదిద్దుతారో తెల్పేవే శ్రీ డి.నాగేశ్వరరావు, దమ్మపేట వారి అనుభవాలు. 2005వ సంవత్సరంలో వారి స్వప్నంలో గొలగమూడి లోని శ్రీ బ్రహ్మంగారి మఠంలో నిత్యం జరిగే సత్‌సంగం కనిపిస్తుంది. సద్గురు కృప పొందడం అనేది మానవుని జీవిత విధానం మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు దమ్మపేట డి.నాగేశ్వరరావు గారి జీవిత విధానం వల్లనే వారంతగా గురు కృప పొందగల్గారు అని అక్కడ

చెపుతున్నారు. వెంటనే మఠం యొక్క ఒక వైపు నుండి శ్రీ బాబాగారు, మరియొక వైపునుండి శ్రీ వెంకయ్య స్వామి వారు వచ్చి సెల్ ఫోన్ సైజులో ఉండే చిన్న పెట్టె అది. దానికి ఉండే చిన్న గుబ్బను త్రిప్పుతుంటే ఆ పెట్టెలోపల ఫిల్ము తిరుగుతూ బొమ్మలు కనిపిస్తాయి. చిన్న పిల్లలు దానిలోని బొమ్మలు చూస్తుంటారు. శ్రీ స్వామి, శ్రీ బాబాగారు ఆ పెట్టెలో నాకు ఏడు బొమ్మలు చూపించారు. (1) చాక్‌పీసుల గుట్ట (2) తెల్ల కాగితాలు (3) కాకర కాయల గుట్ట (4) బిస్కెట్లు (5) కొబ్బరికాయలు (6) జున్నుపాలు (7) బియ్యము.

మెలకువ వచ్చి ఈ మహనీయులు స్వయంగా వచ్చి నాకెందుకీ ఏడు విషయాలు చూపారా అని యోచించాను. ఈ ఏడు విషయాలు నేను చేసే తప్పులని తెలిసింది. నేను స్కూలు హెడ్మాష్టారును. (1) స్కూలు లోని చాక్ పీసులు తెచ్చి మందిరంలో నోటిస్ బోర్డు వ్రాసేందుకు, ముగ్గులు వేసేందుకు ఇస్తుంటాను (2) స్కూలులోని తెల్లకాగితాలను నా ఇంటి అవసరాలకు వాడుతుంటాను (3) నేను హెడ్మాష్టరు నన్న అభిమానంతో ఎవరో వాళ్ళింట్లో కాచిన కాకరకాయలు ఇస్తే తీసుకున్నాను, అలాగే (4), (5), (6) బిస్కెట్లు, కొబ్బరికాయలు, జున్నుపాలు తీసుకున్నాను. (7) రేషన్ డీలరు బియ్యం తక్కువ ధరకిస్తే తీసుకున్నాను. ఇవన్నీ చాలా స్వల్పమైనవే అయినా ఆ మహనీయుల దృష్టిలో పెద్ద తప్పులేనని ఆనాటినుండి పూర్తిగా మానేశాను.

ఇంతలో సత్‌సంగం నుండి కొందరు ప్రశ్నిస్తున్నారు. వారి జీవిత విధానంలో ఇన్ని తప్పులున్నా సద్గురు కృప ఎందుకు కలుగుతుంది? అని. దాని సమాధానంగా - వారు చేసే నిష్కామకర్మే కారణము - కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, ధార్మిక విషయాలకు ఉదారంగా ఖర్చుపెట్టడం లాంటి పనుల వల్ల పుణ్యం జమ అయి సద్గురుకృప



పొందగల్గుచున్నారు, అని చెప్పారు. తప్పులు అని నాకు తెలియని విషయాలు కూడా తెల్పి నా ప్రవర్తన సరిచేసిన ఆ సద్గురుమూర్తుల రుణం ఎలా తీర్చాలో తెలియదు. ఇదే విధంగా నన్ను అన్ని వేళలా కాపాడమని ప్రార్థిస్తున్నాను.

డి.నాగేశ్వరరావు గారి మరొక అనుభవం - కొన్ని సంవత్సరాలుగా మా గ్రామ సాయి మందిరంలో నిత్యం ఒక పొర్లుదండము, తడి బట్టలతో అరగంట నామస్మరణతో ప్రదక్షిణలు భగవంతుడు నిర్విఘ్నంగా చేయిస్తున్నారు. ఈ మధ్య ఒంటిపూట స్కూలయినందున బడికి లేటవుతుందేమోనని ఒకటి రెండు నిమిషాలు ముందుగా ప్రదక్షిణలు ముగించి పోతున్నాను.

ఒకనాటి నా స్వప్నంలో శ్రీ స్వామి వారు నన్ను నా కాలరు పట్టుకొని లాక్కువచ్చి మందిరంలోని గడియారం చూపుతున్నారు. అందులో టైం అరగంటకు రెండు నిమిషాలు తక్కువ ఉన్నది. గడియారం తప్ప అక్కడున్న అల్మరాలు, విగ్రహం, పటాలు ఏవీ కనబడడం లేదు. టైం అయిపోతుందని రెండు నిమిషాల ముందు ప్రదక్షిణలు ముగిస్తున్నందుననే శ్రీ స్వామి వారు ఇలా చూపారని, ఇకముందు అలా చేయనని గ్రహించాను. మనం చిన్న చిన్న తప్పులని భావించేవి కూడా ఆధ్యాత్మిక మార్గంలో పెద్ద తప్పులేనని శ్రీ స్వామి వారు బోధిస్తున్నారు. మన తప్పులను తెల్పి మనలను సరైన మార్గాన నడిపే సద్గురువు లభించారు. వారు చూపిన మార్గంలో నడిచేటట్లు చేయమని ప్రార్థిస్తున్నారు. నీవు ఒక్క అడుగు వేస్తే నేను పదడుగులు వేస్తానంటారు. ఒక్క అడుగువేసే తీవ్ర ప్రయత్నమైన చేసే భాగ్యమిమ్మని ప్రార్థిస్తాను.

**పి. అనూరాధ (ప|| గో|| జిల్లా, తాళ్ళపూడి గ్రామం) ఈ విధంగా చెపుతున్నారు.**

1992 నుంచి తాళ్ళపూడి గ్రామం కాన్వెంట్‌లో పని చేస్తూ ట్యూషన్స్ చెపుతూ డిగ్రీ మరియు స్పెషల్ టీచర్ ట్రయినింగ్ అయ్యాను. నా తల్లిగారు ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో నర్సుగా పని చేసేవారు. నా వయస్సు 25 సం||లు ఒక పాప. మొదటి వివాహం విచ్ఛిన్నమైంది. అయితే తాళ్ళపూడి వాస్తవ్యులైన మా ఊరి వరప్రసాదరావుగారు నన్ను మరలా వివాహం చేసుకుంటానని చెప్పినప్పుడు నేను వద్దన్నా పరిస్థితులు తెలుసు కనుకనే చేసుకుంటానంటే ఏం చెయ్యాలో తెలియక మొదటిసారిగా వెంకయ్యస్వామి చరిత్ర పారాయణ చేసి ఆ స్వామినే సమాధానం కోరాను. పారాయణ పూర్తయిన రాత్రి స్వామిని స్పష్టంగా చూశాను. నా ఆజ్ఞ లేనిదే నిన్ను వివాహం చేసుకుంటాననలేదు. నన్ను నమ్మిన నీకు అన్యాయం జరగదు అని. అది దైవాజ్ఞగా భావించి వరప్రసాదరావు గారిని వివాహం చేసుకున్నాను. అయినా ఎన్నో కష్టాలు పడ్డాను. అన్నింటినీ దైవ ప్రసాదంగా భావించాను. మా వివాహం జరిగి 6 సం||లు పూర్తయింది. 2000 సం||లో స్పెషల్ టీచర్ ట్రయినింగ్‌కి వెళ్ళి వచ్చాను. రిజల్ట్స్ వచ్చేముందు మళ్ళీ పారాయణ చేశాను. బుధవారంతో పారాయణ పూర్తయింది. ఆ రోజు చాలా పెద్ద తుఫాను వచ్చింది. నేను తాళ్ళపూడిలో పారాయణ చేసి రాజమండ్రి కాలేజికి వెళ్ళే దారిలో తుఫానులో చిక్కుకున్నాను. అయితే చిత్రం నేను ఇంటికొచ్చే వరకు తుఫాను అనే విషయం నాకు తెలియదు, నేను వస్తున్నదారంతా చిరు జల్లులుగానే పడింది. తాళ్ళపూడి చేరగానే బస్టాండ్‌లో మావారు నాకోసం టెన్షన్ పడుతున్నారట. ఇంత తుఫానులో ఎలా వచ్చావు అని అడిగితే నేనంటాను, చిరుజల్లేగా అని! పిచ్చి దానిని చూసినట్లు చూశారు నన్ను. అప్పుడు చెప్పాను స్వామి నా దగ్గరుండగా నాకే భయం లేదంటే,



పంతానికి నన్ను ఇంటికి ఒక్కదాన్నే వెళ్ళమన్నారు. ఒకప్రక్క చీకటి 3 కి||మీ|| నడచి వచ్చాను గదా, మొండిగా వెళ్ళాను. ఇల్లు చేరాక లోపలికి వెళ్ళడానికి మార్గంలేదు. రోడ్డునుంచి తోటలో మా యింటికి దారంతా పెద్ద పెద్ద చెట్లు అడ్డంగా ఉన్నాయి. ఇవేమీ నాకు తెలియదు. నేను వెంటనే స్వామిని తలుచుకొని కదలగానే పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగులో సుమారు 70, 80 సం||ల మధ్య వయస్సు గలిగిన పెద్దాయన చేతిలో కర్ర, పంచె కట్టుకున్నారు. భుజంపైన చిన్న తుండుని నడుం చుట్టూ కట్టుకొని ఎందుకమ్మా నారాయణా ఆదినారాయణా అని పిలిచావు. ఇదిగో ఈ వెలుగులో ప్రక్కకి చూడకుండా నన్నే చూస్తూరా అంటే మంత్రం వేసినట్లుగా అలాగే నడిచాను. నేను నడిచిన దారిలో నాకాలికి చిన్న ఆకు కూడా తగలలేదు. గుమ్మంలోకి రాగానే తాత జాగ్రత్త వానలో తడవకు రా లోపలికి అని నేను వెనుతిరిగేసరికి ఎవ్వరూ లేరు, ఇంకా పైగా కటికి చీకటి. మా అమ్మగారు ఎలా వస్తానా అని ఏడుస్తుంటే నా మాటలు మా తల్లిగారికి వింతగాను, భయాన్ని కలిగించాయి. నాకు ఏడుపు ఆగలేదు. స్నానం చేసి దీపం పెట్టుకొని స్వామివారి వద్దనే పసిపిల్లలా ఏడ్చాను. నేను చూసినది ఎవరినో చెప్పమని మీరే అయితే మరలా దర్శనం ఇమ్మని. అలా పూజ మధ్యలోనే చిత్రంగా నిద్ర పట్టింది. అప్పుడు స్వామివారు నన్ను చూస్తూ, రా అంటే వచ్చి నాకు జాగ్రత్తలు చెప్పావుగా తాతా అంటూ మళ్ళీ కన్నీళ్ళా. చూడు రేపు ఏం జరిగినా అధైర్యపడకు నేనున్నాను అన్నారు. వెంటనే మెలుకువ వచ్చింది. తెల్లవారి చూస్తే దారంతా సూదిమోపే ఖాళీ కూడా లేకుండా పెద్ద పెద్ద మానులు పడిఉన్నాయి. దాన్ని తొలగించడానికి వారం రోజులు పనివారిని పెట్టారు. కానీ స్వామివారు నన్ను కనురెప్పపాటులో దాటించారు. స్వామి దేని గురించో నాకు జాగ్రత్తలు చెప్పారు అనుకొంటూనే వుండగా 3 రోజులు తిరగకుండానే నాకు పక్షవాతం వచ్చింది. కుడికాలు, కన్ను, చెయ్యి, నోరు కూడా లాగేశాయి. అయితే నా భర్త నుంచి కానీ,

తల్లి నుంచి కానీ ఆర్ధికసాయం ఏమీ లేదు. అప్పటికి నా వయస్సు 25 సం||లు. ఇది జరిగి 2 సం|| లు అయినది. ధైర్యంగా నా అంతట నేనే హోమియోపతి డాక్టర్‌ని కలిస్తే ఆయన మందులు వేశారు. 10 రోజులు మందులు వాడగానే స్వామి కలలో మందు వద్దని నేను తొక్కే సైకిల్‌ని రోజుకి 3 గంటలు తొక్కమని ఆజ్ఞవేశారు. డాక్టర్ తిట్టినా స్వామి ఆజ్ఞనే పాటించాను. అయితే నా కాలు, చెయ్యి, నోరు వచ్చి నా కన్ను కొద్దిగా చిన్నదయ్యింది. అసలు మాటే పోతుందన్నారు కానీ నా తండ్రి అయిన స్వామి ఉండగా అలా జరగదన్న నా నమ్మకానికి ఆయన ఊపిరి పోశారు. ఇలా ఎప్పటికప్పుడు నా వెంటనుండి నన్ను నడిపించే స్వామి ఈ సంవత్సరకాలంలో జరిగే పరిణామాలను ఎలా చూపిస్తున్నారో వివరాలు చూడండి.

నేను ప్రశాంతంగా ఉంటుందని 21-04-2003 న గొలగమూడి వచ్చాను. నిజానికి ఒకవారం ఉండాలని వచ్చాను. స్నానం చేసి అక్కడ ఆరతి పాడుతుంటే వచ్చిన నేను, స్వామి ఆజ్ఞని స్పష్టంగా విన్నాను. "ఇక్కడ ఉండద్దు వెంటనే వెళ్ళిపో, నీ కోసం ఒక ప్రాణి అల్లాడిపోతుంది. ఈ రోజు నీవు వెళ్ళకపోతే జీవితాంతం నాపై నిందలు వేస్తూ ఏడుస్తావు" అని పదే పదే చెబుతుంటే అనుకున్నాను. నా భర్తకి మరలా వివాహం ఇష్టం లేదు కనుక తనకేదో అయిందని భయపడ్డాను. ఇంటికి వచ్చేటప్పటికి నా భర్తని హాస్పటల్ నుంచి ఆ రోజే తెచ్చారు, కానీ ఏదో ఉపద్రవం ముంచుకొస్తుందని పదే పదే అనిపిస్తున్నా స్వామి ఉన్నారన్న ధైర్యం. కానీ మళ్ళీ అంతలోనే భయం వీటి మధ్య నలిగాను.

నా వివాహమైన సంవత్సరానికి నా భర్త తన తల్లిదండ్రుల బలవంతంపై మరియొక వివాహం చేసుకున్నారు. అది భరించలేక మా తల్లి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. గొలగమూడి నుండి



వచ్చి మా తల్లి చనిపోయి వుందని తెలిసి 45 నిద్రమాత్రలు మింగేశాను. 3 రోజులు నేను మృత్యువుతో పోరాడాను. కానీ నేనే ఓడిపోయి బ్రతికిపోయాను, నాకు స్పృహ వచ్చేటప్పటి వరకు నా తల్లి శవం గోదావరిలోనే వుంది. నేను గుర్తుపట్టిన తరువాత పోష్టుమార్టం చేసి శవాన్ని నాకిచ్చారు. నా తండ్రికి కబురు చేస్తే రాలేదు. నా భర్త విజయనగరంలో వున్నారు. ఏం చెయ్యాలి. శవానికి దహన క్రియలు నేనే చేశాను. దానికి ఎన్నో మాటలు పడ్డాను. కానీ నా తల్లి శవాన్ని అనాధ శవం చేయలేక నేనే చేశాను. ఆ రాత్రి స్వామి ఫోటో దగ్గర ఏడ్చితే స్వామంటారు "గుర్తుందా గొలగమూడిలో వద్దు ఇంటికి వెళ్ళు అన్నది ఇందుకే. నీవు అక్కడ ఉంటే ఈ జీవి సంస్కారం కోసం అలమటించేదే". నమ్మిన వారికి తల్లిదండ్రులకంటే మించిన అండ శ్రీ స్వామివారు. మనం ప్రార్ధించని ఆపద సమయంలో ఆదుకుంటున్నారంటే అందుకు కారణం శ్రీ స్వామి వారితో ఆమెకు గల పూర్వ అనుబంధము - పుణ్యమే.

## ఏ.రాధాకృష్ణ - ప్లాట్ 102, రోడ్ 14, అలకాపురి, హైదరాబాద్ ఇలా వ్రాస్తున్నారు.

నాకు 51వ సంవత్సరాల వయసులో అరుదైన నరాల వ్యాధి సంభవించింది. అంటే లక్షమందిలో ఒకరికి రావచ్చుట. దీని మూలంగా మరియొకరి సాయములేనిదే బలవంతముగా కాళ్ళు లాగుకొంటూ కూడా నడవలేను. నరాలన్నీ బిగుసుకుపోతాయి. ఎన్నో మందులు ఎన్నో లక్షలలో ఖర్చయింది. చీరాలలోని మా మరదలు సలహాపై హైదరాబాద్ నుండి ఒక వ్యానులో పండబెట్టి గొలగమూడికి తీసుకవచ్చారు. ఆ పరిస్థితిలో నడవలేకపోవడమేగాక నడుములు తీవ్రంగా గొడ్డళ్ళతో కొట్టినట్లు బాధ ఉండేది. మందు మింగిన నాలుగు గంటలు కాస్త తగ్గుతుంది. మరలా బాధ. అమేషా మందు మింగరాదంటాడు డాక్టరు

గారు. ఆకలి కూడా లేదు. అదేమి చిత్రమోగానీ గొలగమూడి వచ్చి ఎవ్వరిసాయము లేకుండా 108 ప్రదక్షిణలు చేశాను. నడుములనొప్పి పూర్తిగా పోయింది. ఆకలి బాగా అవుతుంది.

నేను అక్కడే కొన్నాళ్ళుంటే నా వ్యాధి పూర్తిగా నా దరిచేరకుండా పోయి ఉండును. వెంటనే హైదరాబాద్ వచ్చేశాను. 70% తగ్గినా మరలా కొంత కర్మ నన్ను బాధిస్తుంది. నడుముల నొప్పి పోయింది. ఆకలి బాగుంది. కానీ మామూలుగా నడువలేక ఒక కాలు లాగి వేయవలసి వస్తుంది. ఒకరి సాయం లేనిదే నడవలేని నేను గొలగమూడిలో పద్మావిహార్ నుండి శ్రీ స్వామి వారి మందిరానికి ఒక్కడినే ఎవ్వరి సాయంలేకుండా కుంటుతూ నడిచి వెళ్ళి రాగలుగుచున్నాను. నా బాధలకు నా సాధనా లోపమేనని తెలుస్తుంది. కానీ ఆ మహనీయుని దివ్య మహిమను గూర్చి అందరికీ చెప్పి వారి కృప పొందేందుకు గొలగమూడి పుణ్యభూమికి వెళ్ళమని చెపుతున్నాను. ఆ మహనీయుని ఋణం తీర్చలేను

## సత్యం - ధర్మం

శీతానగరం - ప||గో|| జిల్లా - అడపా మాధవిగారు మరియు వీరి భర్త రాంబాబుగారు తమకు శ్రీ స్వామివారు ఒక దివ్యానుభవం ద్వారా సత్యం తప్పకూడదని చక్కగా బోధించిన వివరం ఇలా వివరించారు.

2004 వ సం||లో శ్రీ స్వామి వారి దగ్గర మూడు నిద్రలు చేయాలని వస్తున్నాము. మా (మాధవి) సోదరడు బెంగుళూరులో ఉద్యోగం చేస్తుంటే ఆయన్ను కూడా గొలగమూడి రమ్మని చెపితే కారులో వచ్చారు. తనకు ఉద్యోగం గనుక తప్పక వెళ్ళిపోవాలని మమ్ములను



కూడా కారులో బెంగుళూరు రమ్మని బలవంతం చేశాడు. మేము కాస్త మొహమాటపడి శ్రీ స్వామి వారి చెంత అనుకున్న ప్రకారం మూడు నిద్రలు చేయకుండానే రెండు నిద్రలు కాగానే కారులో బెంగుళూరు వెళ్ళాము. ఒక వారం ఉండి తిరిగి శీతానగరం వచ్చేస్తున్నాము. మధ్యమార్గంలో మావారికి భుజమ్మీద నొప్పి రాసాగింది. చాలా బాధ చేసింది. ఎట్లాగో ఇంటికొచ్చి చిన్న చిన్న వైద్యాలేగాక M.B.B.S. డాక్టర్లకు చూపించాము. మందులు వాడుతున్నాము. ఎక్సరేలు తీయించాము. నరం ఏమీ చిట్లలేదు. అంతా బాగుందంటారు. చేయి అట్లా కదిలించలేడు. ఎంతో బాధ, పడుకోలేడు, కూర్చోలేడు. ఊరంతా వచ్చి చూచి పోతున్నారు. ఒకవారం ఇలా యమయాతన పడ్డాక శ్రీ స్వామి వారి దగ్గర రెండు చీట్లు వేశాము. ఎక్కడికైనా పొమ్మని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. ఎక్కడికీ పోవద్దని శ్రీ స్వామివారి ఆజ్ఞ అని. ఎక్కడికీ పోవద్దని వచ్చింది. ఆ బాధతో అట్లాగే ఐదురోజులు అల్లాడినారు. స్వామీ ఐదు రోజులు చూచాము. ఇక ఉండలేము. ఎవరికైనా చూపాలని చెప్పుకున్నాను. ఉదయం ఏడు గంటలకు పిల్లలకు బడికి వెళ్ళేందుకు అన్నం బాక్సులు సర్దిపెట్టి వారిని చూస్తే చాలా ఘాడంగా నిద్ర పోతున్నారు. గత పదిహేను రోజులుగా రాత్రింబవళ్ళు నిద్రలేని వారు అలా నిద్రపోతుంటే వారికి నిద్రాభంగము కల్గించలేక టిఫిన్ తినేందుకు కూడా లేపలేదు. మధ్యాహ్నం 12 గంటలకు నిద్రలేపి టిఫిన్ పెట్టాను. తిరిగి సాయంత్రం 4 గంటల వరకు మరలా ఘాడంగా నిద్రపోయారు. 4 గంటలకు లేపి స్నానం చేయించి అన్నం పెట్టాను. అన్నం తిని నిద్రపోయారు. మరలా రాత్రంతా ఘాడంగా నిద్రపోయారు. తెల్లవారి నేను శ్రీ సాయి సత్యవ్రతాలకు కందుకూరు పోవలసిఉన్నది. వారికి నొప్పి తగ్గింది కనుక కందుకూరు వెళ్ళి ఆ రాత్రి అక్కడుండి తెల్లవారి ఇంటికి వచ్చాను. ఏ బాధ లేకుండా చక్కగా ఉన్నాడు. ఏమండీ! మీరు ఒక్క మందు కూడా తినలేదే ఇంత షడన్‌గా ఎలా నొప్పి తగ్గింది అంటే అప్పుడు సిన్న తనకు

ఉదయం 7 - 12 గంటల మధ్య వచ్చిన స్వప్న వృత్తాంతం చెప్పారు. తన స్వప్నంలో ఒక ముసలాయన వచ్చి ఒక చిన్న కర్రతో తనకు నొప్పి పుట్టే భుజం పై కొట్టారని - ఇక బాగుంటుందని చెప్పారని అది మొదలు బాగుందని తన స్వప్న వృత్తాంతం వివరించారు. అది మొదలు ఏ బాధ లేకుండా ఉన్నారు. కనుక ఈ దఫా వచ్చి తప్పక మూడు సిద్రలు చేయాలని వచ్చాము.

మూడు సిద్రలు చేస్తామని చెప్పుకొని చేయలేదు కనుక మాకీ బాధ వచ్చిందని సత్యం ఎప్పుడూ తప్పకూడదని శ్రీ స్వామివారు మాకు అనుభవం ద్వారా నేర్పారు. వారు చెప్పింది record చేసి tape నుండి వ్రాశాము.

## పారాయణ మహాత్మ్యం

T.V.H. రామకృష్ణగారు - ఇంజనీర్ (గ్లాస్), A.G.I. గ్లాస్ ప్యాక్, బోరబండ, హైదరబాద్ ఇలా వ్రాస్తున్నారు. నాకు ముఖమంతా పులిపెర్లు లేచి చాలా బాధ పెట్టాయి. డాక్టర్లు ద్వారా కరెంటుతో కాల్పించాను, హోమియో మందు తిన్నాను. ఏమాత్రమూ తగ్గలేదు. ఈ విధంగా నాలుగు సంవత్సరాలు గడ్డమే గొరగుటకు వీలులేక పెంచేశాను. అలాంటప్పుడు శ్రీ సాయి చరిత్ర, శ్రీ వెంకయ్య స్వామివారి చరిత్ర ఒక వారం పారాయణ చేసి విభూతి పూసి చూద్దామని ప్రయత్నం చేశాను. ఒక వారం తర్వాత గడ్డం చేసుకుంటే, చూద్దామన్నా ఒక్క పులిపిరి కూడా ముఖం మీద లేదు. శ్రీ స్వామి వారి దివ్యలీలలు పొగడతరమా గురుబంధూ.



## చిన్నపాపను తన మార్గానికి లాగిన శ్రీ స్వామి

11 సం|| వయసు గల మా పాపకి ప్రక్కటెముకల క్రింద నొప్పి వస్తుంది. డాక్టరుకు చూపిస్తే ఎక్సరే తీసాడు. మిగిలిన టెస్టులు చేసి ఏమీలేదు, గ్యాస్ నొప్పిలాగా ఉన్నది అని బాగా పవర్‌ఫుల్ టాబ్‌లేట్స్ ఇచ్చాడు. పులుపు, కారం తినవద్దు అన్నాడు. మా పాప సరిగా తీపి ఇష్టపడదు. అన్నం తిందాము అని వెళ్ళి రెండు ముద్దలు తిని నొప్పి వస్తుంది అని లేచిపోయేది. ఇలాంటి పరిస్థితులలో మందులు వాడుతూ పత్యం చేస్తే నెలరోజులకు తగ్గింది. తరువాత ఒక నెలరోజులు అయ్యాక కొంచెం పులుపు తగిలేసరికి మళ్ళీ వచ్చేసింది మళ్ళా డాక్టరు దగ్గరకు తీసుకొని వెళదాము అనుకున్నాను. ఈలోగా మా పాప ఒకరోజు గుడికి వెళ్ళి రెండు రూపాయలు దక్షిణ వేసి స్వామి నాకు నొప్పి తగ్గించు అని ప్రార్థించింది. ఇంటికి వచ్చాక నాతో చెబితే నేను శనివారములు వెంకయ్యస్వామి భజన "కాపాడవయ్యా వెంకయ్యస్వామి" చదువు అని చెప్పాను. సరే అని శుక్రవారం చదివింది, శనివారం చదివింది అంతే ఆదివారం నుండినొప్పి లేదు. పులుపు, కారం తింటున్నా రావటం లేదు. ఇప్పుడు మా పాప రోజూ వెంకయ్య స్వామి భజన చదువుతుంది. స్వామి కృపవల్లనే తగ్గింది అనే విశ్వాసం నాలోనేగాక మాపాపకు కలిగించారు. ఎంత కరుణామయులు. ఏమి ఇచ్చి ఆయన ఋణం తీర్చుకోగలము. జీవితాంతం ఆయన సేవలో నిలవగలగడమే మేము ఆయనకు ఇచ్చే దక్షిణ. మా ప్రయత్నానికి స్వామి ఎప్పుడూ (ఆయన సేవలో ఉండటానికి) సాయం చేస్తూ ఉండాలని ప్రార్థిస్తూ,

స్వామి పాదరేణువు
డి.శారద, దమ్మపేట.

చిన్నశెట్టి గోపి అను నేను ఖమ్మం జిల్లా దమ్మపేట (మం||), దమ్మపేట గ్రామములో నివసించుచుంటిని. నేను ఐదవ తరగతి చదువుచున్నప్పుడు 1997వ సంవత్సరం దీపావళి పండగనాడు తోటలోకి వెళ్ళి అక్కడ నీరసంగా అనిపించి, కళ్ళి తిరిగి క్రింద పడ్డాను. అప్పుడు మూర్ఛలాగా వచ్చి క్రింద పడిపోయాను. అక్కడనుంచి ప్రతిరోజు ఫిట్స్ (మూర్ఛ) రావటం ప్రారంభమైంది. ఆ తరువాత ఏలూరు ఫిట్స్ స్పెషలిస్టు దగ్గర చూపించాము. కానీ కొంచెం తగ్గినట్లుగా అనిపించింది. కానీ తరువాత నెలకు పదిసార్లు రావటం మొదలైంది. తరువాత నేను స్వతహాగా సాయిబాబాగారి భక్తుడును. తరువాత, సాయిబాబాను నమ్ముకున్న నేను వెంకయ్యస్వామిగారి గుడికి వస్తానని మా అమ్మగారు ముడుపు కట్టారు. అప్పటినుండి నాలో మార్పు వచ్చి నా ఫిట్స్ పూర్తిగా తగ్గిపోయింది. ఇప్పుడు నాకు ఎటువంటి భాద లేదు.

భగవంతుడు ఒక్కడే. వారే దేశ కాలానుగుణముగా అనేకమంది మహనీయుల రూపాలలో అవతరించి భక్త రక్షణ చేస్తుంటారు. ఈ మహనీయుల అందరి మధ్య ఐక్యతే కానీ, సామాన్య మానవులకు వలె విరోధ భావం ఉండదు. శ్రీ సాయినాధుని భక్తురాలికి శ్రీ వెంకయ్య స్వామివారు భౌతిక దర్శనం ప్రసాదించి వారి భిక్షను స్వీకరించడం ద్వారా మహనీయుల మధ్య మనలో ఉండే భేదభావం నశింపజేసుకోమని బోధిస్తున్నారు.

పి.అనంతలక్ష్మి సత్యవతి, నెం.46, 3వ అవెన్యూ డి.ఎ.ఇ. టౌన్ షిప్, కల్పాకం - 603 102, తమిళ్‌నాడు గారు 1997 లో "సాయినాధా! నాకు మంచి క్వార్టరు చూపిస్తే నీ పేరుతో అన్నానికి లేని అభాగ్యునికి అన్నం పెడతానని మొక్కుకున్నారు. తనకు మంచి ఇల్లు దొరికింది.



కాని అన్నానికి లేని అభాగ్యునికి అన్నం పెడతానన్నమాట చెల్లించలేక ఎవరో ఒక ఆయాకు భోజనానికిగాను డబ్బిచ్చారు. తన తప్పు గ్రహించి నిరుపేదయైన మరొకరికి అన్నం పెట్టాలనుకున్నారు. కానీ 25 రోజుల వరకు ఎవ్వరూ దొరకలేదు. 25 వ రోజున, నేను నా మాట చెల్లించుకో లేకున్నాను బాబా, అన్నానికి లేని నిరుపేదను చూపండి అని చెప్పుకున్నది. నాడు మధ్యాహ్నం 11½ గంటలకు - ఎముకల గూడు వలెనున్న ముసలాయన, బిక్షగాళ్ళవరూ రాని మా మూడవ అంతస్తు మేడ మెట్లెక్కి వచ్చి, అన్నం అడిగారు. రాత్రి వండిన అన్నం చాలా ఉంది. అది పెట్టాలనుకున్నాను. వెంటనే ఆ తాత "వేడన్నం ఉందా? పెడతావా? అని అడిగారు. ఆహా సాయి నా ప్రార్ధన మన్నించి వచ్చాడని వేడన్నం పార్శిలు కట్టి ఇచ్చాను. ఈ లోగా మా ఎదురింటామె కాఫీ ఇచ్చింది. ఆ మెట్ల మీద కూర్చొని త్రాగారు. ఒక్క నిమిషంలో అన్ని మెట్లు దిగి ఎలా వెళ్ళారో అర్ధం కాలేదు. వచ్చినది సాయినాధుడే అనుకున్నాను. ఆ తర్వాత మా ఇంట్లో సత్‌సంగం జరిగింది.

స్మృతి మాత్ర ప్రసన్నాయ నమ: అనే పుస్తకంలోని శ్రీ వెంకయ్య స్వామి బొమ్మచూచాను. ఆనాడు మా యింటికి వచ్చి అన్నం తీసుకవెళ్ళిన మహనీయుడు వీరేనని స్పష్టంగా గుర్తించాను. సాయినాధుని భక్తురాలనైన మా యింటికి నా పిలుపు లేకుండానే శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి వారు వచ్చి బిక్ష గ్రహించారంటే మహనీయులందరికీ రూపంలో భేదం తప్ప తత్వంలో ఎలాంటి భేదము లేదని బోధిస్తున్నారు.

నా పేరు డి.సాంబయ్య. A.P.S.R.T.C., విజయవాడ. మేము డిసెంబరు 2002 లో షిరిడీ వెళ్ళి వచ్చిన తరువాత నా భార్య కస్తూరికి కడుపులో గడ్డలు అయి, కొన్ని పగిలి, కడుపులో బాగా నీరు వచ్చి, వాపు వచ్చింది. విజయవాడలో పరీక్షలు చేయిస్తే అది కాన్సర్ అని డాక్టర్లు

నిర్ధారించారు. హైదరాబాదు తీసుకువెళితే ఆమె బ్రతకదని ఇంటికి తీసుకుని వెళ్ళిపొమ్మని చెప్పారు. నేను వేరొక డాక్టర్ని సంప్రదిస్తే ఆపరేషన్ చేస్తే బ్రతుకుతుందని చెప్పగా ఆపరేషన్ చేయించాము. 5 లీటర్ల నీరు తీశారు. కానీ డాక్టర్ ఇంకా కడుపులో చిన్న చిన్న గడ్డలు ఉండిపోయాయి తొలిగించ వీలుకాలేదు, నమ్మకంలేదు, కానీ ఇంకొంచెం కాలం బ్రతికితే బ్రతకవచ్చు అని చెప్పారు. విజయవాడలో నా మిత్రులు K. రాధాకృష్ణగారు మమ్ములను గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి వద్దకు వెళ్ళమని, వారు ఎన్నో, ఎందరికో తగ్గిస్తున్నారని, వారి అనుభవం కూడా వివరించి చెప్పారు. వారి సలహా ప్రకారం డిసెంబరు నెలలో (2003) భార్యా, భర్తలు ఇద్దరూ ఐదు ఇండ్లలో భిక్ష చేసి, మేము కొంత వేసి అదంతా శ్రీ స్వామి వారి ఆశ్రమంలో ఇచ్చాము. స్వామి దర్శనం చేసుకుని వారి భిక్షాన్న ప్రసాదం స్వీకరించి ఇంటికి వెళ్ళాము.

తరువాత జనవరి నెలలో ఆస్పత్రికి వెళ్ళి పరీక్షలు చేయించగా అసలు నీరుకానీ, గడ్డలు కానీ ఏమీ లేవు. అంతకు ముందు ఎంతో ఎక్కువగా ఉన్న షుగర్ కూడా కంట్రోల్ అయిపోయిందని డాక్టర్లు చెప్పారు. స్వామిని ప్రార్థించిన తరువాత నుండీ ఏ మందులూ వాడకపోయినా స్వామి కృపతో ఆమె సంపూర్ణ స్వస్థురాలయింది. ఇప్పుడు ఆమె పని ఆమె చేసుకోగలుగుతూ మాకూ చేసి పెడుతుంది. అందుకు మా కుటుంబ సభ్యులందరం శ్రీ స్వామికి ఎంతో ఋణపడి ఉన్నాము. మాకు వీలైనంత వరకూ శ్రీ స్వామి సేవ చేసుకోవాలనీ, నలుగురుకీ స్వామి గూర్చి తెలియచెప్పాలనీ మా ఆకాంక్ష.



**లేబాక విజయమ్మ, W/o. లేబాక మునిరామిరెడ్డి, అయ్యపురెడ్డిపాళెం, నెల్లూరు జిల్లా ఇలా వ్రాస్తున్నారు**

మేమిద్దరం గోదావరి పుష్కరాలకు వెళ్ళాలనుకున్నాము. 10 రోజుల ముందు నా స్వప్నంలో శ్రీ స్వామివారు మా నాన్నలాగ కనిపించి అమ్మా అని పిలిచారు, నేను పలికాను. మీరు రాజమండ్రి పుష్కరాలకు వెళ్ళాలనుకుంటున్నారా? అవును - పైన చూడు పైన ఒక మెరుపు మెరిసినట్లుంది. ఆ తర్వాత నాకు వళ్ళు తెలియలేదు. కళ్ళు తెరవమన్నారు, తెరిచాను, ఏమైందమ్మా అక్కడ అన్నారు. నీరు, నీళ్ళలో తామర ఉందన్నాను. అంతేగదమ్మా, గొలగమూడి కోనేటిలోకూడా అదే ఉంది. పుష్కరుడు ఎప్పుడూ ఇక్కడ కోనేటిలో ఉన్నారు. అక్కడికి పోబళ్ళేదే, కావాలంటే పుష్కరాలకు వెళ్ళిన వాళ్ళను అడుగు. స్వప్నంలోనే అడిగాను, వాళ్ళు కూడా అదే చెప్పారు. కనుక నేను పుష్కరిణికి పోదల్చలేదు. కానీ మావారు బలవంతం చేయసాగారు. శ్రీ వెంకయ్య స్వామి దగ్గర చీటీ వేసిపోవాలనుకున్నాము. కానీ చీట్లు వేయకుండానే వెళ్ళాము. రాజమండ్రిలో రైలు దిగేచోట విపరీతమైన రద్దీవలన ప్లాట్‌పారం వైపుకి కాకుండా మరొక వైపు దిగాము. పెద్ద మట్టిదిబ్బ మీద దిగాను. మనుషులు తొక్కిడి వలన మట్టిదిబ్బనుండి జారిపడి చచ్చేంత పని అయి స్వామి కృపవలన క్షేమంగా ఇల్లుచేరాము. శ్రీ స్వామి వారు వద్దన్నా వెళ్ళినందుకు మంచిపాఠం నేర్పారు.

**కలకోటి సుబ్బారావు, పార్కలగండి, దమ్మపేట మండలం, 24-08-2005 గారి అనుభవం**

మనం వారిని ప్రార్థించకున్నాగానీ రక్షిస్తున్నారు. అది కేవలం పూర్వపుణ్య ప్రభావమే. మా మేనల్లుడు జార్ఖండ్‌లో M.Tech చదువుచున్నాడు. వాళ్ళ అన్నగారి నిశ్చితార్థముకు ఇంటికి వచ్చాడు.

అది అయిన తరువాత బంధువుల ఇళ్ళకిపోయి అటునుంచి మానసికంగా స్థిమితం తప్పి తెలియకుండానే బొంబాయి వెళ్ళిపోయాడు. మేము ఇక్కడంతా వెదకినాము. ఈ విధంగా వారం రోజులు వెతకిన తరువాత మా భార్యకు వెంకయ్యస్వామి కలలో కనిపించి నన్ను గొలగమూడికి పంపిస్తే అబ్బాయి దొరుకుతాడు అని చెప్పారు. దానితో నా భార్య నన్ను బలవంతం చేసి గొలగమూడికి పంపించింది. దానితో నేను గొలగమూడికి వచ్చి ఇక్కడంతా వెతకి చివరకు ఇంటికి ఇక్కడలేడని ఫోను చేశాను. అప్పటికి మా మేనల్లుడు బొంబాయిలో ఉన్నట్లుగా ఇంటికి ఫోను చేసినాడు. వెంకయ్యస్వామి దగ్గరకు రావడం వల్లనే స్వామి కలలో చెప్పినట్లు పిల్లవాడు దొరకడం జరిగింది. మన ప్రార్ధన లేకుండానే శ్రీ స్వామివారు స్వప్నాదేశమివ్వడమంటే - శ్రీ స్వామివారితో మనకుగల పూర్వ అనుబంధము, పూర్వపుణ్యమే కారణము. నేటికైనా ఆ అనుబంధం పెంచుకొని తృప్తి, శాంతి, ఆనందం పొందుతాం.

**పి.సీతారామాంజనేయులు, భవానిపురం, విజయవాడ వారి అనుభవాలు.**

నేను సుమారు 11 మాసాలనుంచి సరిఅయిన ఉద్యోగంలేక, అనారోగ్యంతో (కిడ్ని వ్యాధితో) నేను చేస్తున్న ఉద్యోగంలో కూడా జీతం సరిగ్గా రాక సుమారు 87,000/- కంపెనీ నాకు బాకీ పడింది. అది రాక, ఉద్యోగం చేయక, మానసిక మనస్పర్ధలతో ఉండగా శ్రీభరద్వాజ సత్సంగ మండలి, భవాని పురం రాజ మాష్టారిగారి 2 సత్సంగాలకు హాజరయ్యి శ్రీ గురుచరిత్ర పారాయణాన్ని 2 ఏకాహాలు, 5 సార్లు సప్తాహాలు పూర్తి చేశాను. ఆ సత్సంగ సభ్యులు అయినటువంటి శ్రీ శ్రీనివాస్‌గారి సలహామేరకు రెండువేల రూపాయలు అప్పు తెచ్చుకొని గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి వారిని 12-02-2002 న మొదటిసారిగా దర్శించాను. 13వ తారీఖున (13-02-2005) ఒంగోలులోని శ్రీ భరద్వాజ మాష్టారిగారి



సమాధిని దర్శించి శ్రీ వెంకయ్యస్వామి వారి "అవధూత లీలలు" 3 సప్తాహాలు వరుసగా చదువుతాను అనుకొని నాకు కంపెనీ బాకి ఉన్న డబ్బులు రావాలి, మంచి ఉద్యోగం రావాలని స్వామివారిని కోరుకుని, 13-02-2005 న విజయవాడ చేరి 14-02-2005 నుంచి అవధూతలీల పారాయణ ప్రారంభించాను. చిత్రంగా ఆరోజు కిడ్నితో చాలా భాదపడి 3 రాళ్ళు బయటికి వచ్చాయి. దానికి నేను ఏ మందులు వాడలేదు. పారాయణ మాత్రము చేతనే నాకు అట్టి భాగ్యమును శ్రీ వెంకయ్యస్వామి వారు ఇచ్చినారు. అట్లాగే అవధూత లీలలు 2 సప్తాహాలు పారాయణ అయిన వెంటనే పాత కంపెనీ వారు పిలచి 20,000/- (ఇర్వై వేల రూపాయలు) ఇస్తామని ఉద్యోగం చేయమని. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి మీరు డీలరుగా ఉండి, వ్యాపారాన్ని సాగించమని దానికిగాను జీతంగా కాక, 12% చొప్పున వారి వ్యాపారంలో నాకు మార్కెటింగ్ అవకాశం కల్పించారు. 12-02-2005 నుంచి 12-05-2005 వరకు సుమారు అర్వై వేల రూపాయలు నాకు వచ్చినవి. ఇవియేకాక మరియొక రెండుసార్లు నాకు శ్రీ వెంకయ్యస్వామివారు ప్రత్యక్షంగా నన్ను రెండు పెద్ద పెద్ద సమస్యలనుంచి రక్షించారు.

స్వామివారి ఒక అద్భుతలీల గురించి నేను చెప్పినా నమ్మని స్వామివారి లీల, గురించి చెప్పాలని ఉంది.

నేను ఒక వ్యక్తికి ఇర్వై ఐదువేల రూపాయలు బాకి ఉండి వారితో మంచిగానే ఉండేవాడిని. గొలగమూడి వచ్చి వెళ్ళిన తరువాత అతను చిత్రంగా నామీద ప్రతి విషయంలోనూ పోట్లాడడం, ఇంటికి వచ్చి తగువులాడటం ఇట్లా ఒకవారం రోజులు జరిగింది. శ్రీ వెంకయ్య స్వామివారిని వేడుకొని నేను అతనితో నీ బాకీ 25-04-2005 న చెల్లిస్తానని హామి ఇచ్చి, నా వ్యాపార లావాదేవిలలో వున్నాను. 21-04-2005 నాటికి

నా పేరున బ్యాంకులో ఇరవైరెండువేల రూపాయలు మాత్రమే ఉన్నవి. 23-04-2005 న అతను మరలా వచ్చి వాదనకు దిగితే నేను ఈ రోజున మహావీర్ జయంతి బ్యాంకులు ఉండవు, రేపు ఇస్తాను అని ఎంత చెప్పినా వినకపోయేసరికి నేను ఆంధ్రబ్యాంకు ATM కార్డుద్వారా పదివేల రూపాయలు డ్రా చేసి ఇచ్చినాను. రేపు పొద్దున్న మిగితా పదిహేను వేలు ఇస్తానని వెళ్ళి చెపితే సరే అన్నారు. 23-04-2005 న బ్యాంకుకు వెళ్ళి చెక్ మీద 12,000/- వ్రాసి ఇచ్చి మేనేజరు గారితో బ్యాంకులో మినిమం బ్యాలన్సు లేదు, రెండు రోజులలో బ్యాలన్సు వేస్తానని చెప్తే మానేజర్ గారు అకౌంట్ చూసి మీ అకౌంట్‌లో ఇరవై మూడువేలు బ్యాలన్సు ఉంది అనటం, నేను పదిహేను వేలు డ్రా చేసి వారికి ఇచ్చి నా ప్రాంసరి నోటు తీసుకోవటం జరిగింది. ఇది మొత్తం శ్రీ స్వామి వారి లీల కాక మరియేమిటి? ఇది జరిగిన ఒక వారం రోజులకు బ్యాంకు నుంచి ఫోను వచ్చి పొరపాటున మీకు 3,000/- ఇచ్చాము, మీరు ఈరోజు బ్యాంకులో జమ చెయ్యవలసిందిగా కోరినారు. చిత్రం ఏమిటంటే నా అకౌంట్‌లో ఉన్నవి మొత్తం 22,000/- నేను తీసుకున్నవి ఇరవై ఐదువేల రూపాయలు. ఈ మొత్తాన్ని నాకు ఇప్పించి నన్ను స్వామివారు రక్షించినారు. ఇందులో నా దగ్గరలేని 3,000/- రూపాయలనీ స్వామివారు ఆంధ్రబ్యాంక్ వారి కంప్యూటర్ ఒక్కరోజు నా అకౌంట్‌లో పనిచేయనివ్వక నన్ను రక్షించారు. ప్రార్థన లేకుండానే శ్రీ స్వామి వారు ఎలా రక్షిస్తారో చూడండి.

నా పేరు అమృత, మా ఊరు గార్ల, ఖమ్మం జిల్లా. మా నాన్నగారి పేరు వెంకటేశ్వరరావు గారు. మా ఊరులో వ్యవసాయం చేసుకుంటూ ఉంటారు. మా తల్లితండ్రులకు ఇద్దరం సంతానం. అన్నయ్య, నేను. నాకు 1999 లో తీవ్రంగా జ్వరం వచ్చింది. రక్తం తగ్గి అసలే రక్తం లేకుండా పోయింది. మనిషి అంతా పాలిపోయినట్లు తెల్లగా అయిపోయాను. డాక్టర్లు అన్నీ పరీక్షలు చేసి ఈమెకు ఇక్కడ తగ్గదు,



వెంటనే హైదరాబాద్‌కు తీసుకొని వెళ్ళండి, పెద్ద హాస్పటల్‌లో చూపించండి అన్నారు. మా వాళ్ళు చేసేది ఏమిలేక వెంటనే హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్‌లో చేర్పించారు. హైదరాబాద్ లోని ఆసుపత్రిలో ఎంత ఖర్చు అవుతుందో మీ అందరికి తెలుసు. ఆ విధంగా ఖర్చు పెట్టినా గూడా నయంకాని లుకేమియా అనే వ్యాధి వచ్చింది. డాక్టర్లు "మేము మందులు ఇస్తాము. ట్రీట్‌మెంట్ మొదలు పెడతాము, తగ్గితే తగ్గుతుంది. లేకుంటే లేదు. మేము మాత్రం ప్రాణానికి హామీ ఇవ్వలేము. ఖచ్చితంగా బ్రతుకుతుంది అని చెప్పలేము" అని చెప్పారు. దేవుని మీద భారం వేసి మా వాళ్ళు హాస్పటల్‌లో చేర్పించారు. డాక్టర్లు ట్రీట్‌మెంట్ మొదలు పెట్టారు. అలాంటి సమయంలో మా పెద్దనాన్న డాక్టరు శేషగిరిరావుగారు హాస్పటల్‌కి వచ్చి నా పరిస్థితి తెలుసుకొని నాకు గొలగమూడి వెంకయ్యస్వామి చరిత్ర ఇచ్చి, దాన్ని పారాయణ చేయమని, దారం చేతికి కట్టమని విభూతి పెట్టి వెళ్ళారు. ప్రతిరోజు నేను బెడ్ మీద పడుకుంటే విభూతి పెట్టి దారం చేతికి కట్టి మా అమ్మ, నాయనమ్మ లెక్కలేనన్నిసార్లు స్వామి కృప, గురుచరిత్ర పారాయణ చేయించి నాకు వినిపించేవారు. మా పెదనాన్న ఇంట్లో అఖండం, మా మేనత్త ఇంట్లో అఖండం వెలిగించారు. నా గురించి మా వాళ్ళంతా స్వామిని ప్రార్థించారు. ఇలాంటి సమయంలో నాకు ట్రీట్‌మెంట్ మొదలైంది. మందుల వలన ఇన్‌ఫెక్షన్ వచ్చింది. డాక్టర్లు బ్రతికే సూచనలేదు ఆశ వదులుకోమన్నారు. మా వాళ్ళంతా ప్రాణాలు అరచేతిలో ఉంచుకొని దు:ఖంతో మునిగి యున్నారు. ఒకరోజు మధ్యాహ్నం నేను లేవలేని పరిస్థితిలో ఉన్నాను. కాళ్ళు చేతులు, కళ్ళు వాపులు. ఇన్‌ఫెక్షన్‌తో ఎఱ్ఱగా మారింది. మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో 80 సం|| ఒక అతను ముసలాయన రూపంలో వచ్చి నా బెడ్డు మీద కూర్చొని ఏమమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు? నీకు నేను ఉన్నాను. నీకు బాగు చేస్తాను, నీకు బాగుచేస్తే నాకేమిస్తావు, అన్నారు. అంతకుముందు నేను స్వామి చరిత్ర వినడం

వలన నాకు ఆరోగ్యం బాగైతే మీకు 150 సార్లు ప్రదక్షిణం చేస్తాను, అని అన్నాను. వెంటనే తనవద్దనున్న తంబురతో నా కాళ్ళమీద రెండు దెబ్బలు వేసి నీకు తగ్గుతుంది అని ఆశీర్వదించి అదృశ్యమయ్యారు. అప్పటినుండి ఒక్క రోజుకే క్రమంగా వెంటనే నాకు నయమైంది. మరల బ్లెడ్ టెస్టు చేయించితే ఎలాంటి ప్రాబ్లమ్ లేదు. జబ్బు పూర్తిగా నయిం అయింది. ఇలా ఒక్కసారి ట్రీట్‌మెంట్‌కే ఇంత మంచిగా నయం అయ్యి బ్లెడ్ మంచిగా వచ్చింది. ఈ విధంగా మంచిగా రావడం అంతా దైవకృప. ఇంతమందికి ట్రీట్‌మెంట్ చేస్తాము, కానీ ఒక్కసారికే నయం కావడం మేము చూడలేదు అని డాక్టర్లు ఆశ్చర్యపోయారు. ఇది అంతా ఆ స్వామి కృప, ఇది అంతా ఆ దైవలీల కాకుండా ఏమి అయి ఉంటుంది. నాకు నయం అయ్యాక గొలగమూడికి వెళ్ళి స్వామి వారి సమాధి మందిరానికి 150 సార్లు ప్రదక్షిణాలు చేసినాను. మరల అప్పుడప్పుడు స్వామి దగ్గరకి వచ్చి స్వామిని దర్శించుకుంటున్నాము. ఈ విధంగా మృత్యుముఖం నుండి కాపాడబడినవారు నిత్యం కొంతకాలము శ్రీ స్వామి వారి పారాయణ, పూజ, ప్రదక్షిణలకు కేటాయిస్తుంటే జీవితాంతం వారి అండ ఉంటుంది.

ఇట్లు, మాటేటి అమృత

## కనగర్ల ధర్మ లక్ష్మి గారు, భీమడోలు, ప||గో|| జిల్లా, శ్రీ స్వామివారి మహిమను ఇలా వివరిస్తున్నారు.

మా ఇంటి ప్రక్క నివసించే చెల్లాయమ్మగారు ఒకరోజు చాలా విచారంగా కూర్చొనున్నారు. నేను కారణమడిగితే తన బర్రెకు రొమ్ముదగ్గర కురుపు లేచి చాలా బాధ పడుతుందని, పడుకోలేక లేవలేక కష్టపడుతుందని, తన కుమారుడు రోజూ వేయించే 350/- ఇంజెక్షన్ ఈ రోజతడు లేని కారణంగా వేయించలేకున్నానని ఎంతో దీనంగా చెప్పింది.



వెంటనే నేను ఆ బర్రెకు శ్రీ వెంకయ్యస్వామి వారి దారం కట్టి, విభూతి పెట్టి ఏమీ బాధపడవద్దు తప్పక తగ్గుతుందని ధైర్యం చెప్పి వచ్చాను.

ఆ రాత్రి నన్నెవరో తరుముకుంటునట్లు స్వప్నమొచ్చింది. నిద్ర లేచి ఆలోచించాను. శ్రీ స్వామివారు ఆ బర్రె జబ్బును తరుముతున్నారని తోచి శ్రీ స్వామి వారిని ఇలా ప్రార్థించాను. "స్వామీ నాకు కాదు మీరు కనిపించవలసినది, ఆ బర్రెగల యల్లాయమ్మగారికి కనపడండి" అని చెప్పుకున్నాను. అదే రాత్రి నేను పూల చీర కట్టుకొని యల్లాయమ్మ గారింట్లోకి వెళ్ళినట్లు ఆమెకు స్వప్నమొచ్చిందట. ఆమె నిద్రలేచి తలుపులన్నీ వేసి ఉంటే ధర్మలక్ష్మి ఇంట్లోకెట్లా వచ్చిందబ్బా అని ఆలోచించి పడుకున్నది. తెల్లవారికి ఆ బర్రెకు కురుపు కాదు గదా కురుపున్నచోట మచ్చ కూడా లేకుండాపోయినది.

ఆ కరుణామయుడు బర్రెకు నయం చేయడమే గాక, స్వామీ తమరు చెల్లాయమ్మ గారికి కనిపించండి అని నేను చెప్పుకోగానే నా రూపంలో ఆమెకు స్వప్న దర్శనమిచ్చారు. పిలువగానే పలికే సద్గురుమూర్తిని తగినట్లు సేవించే భాగ్యమిమ్మని ప్రార్థిస్తున్నాను.

## పి. పోతులూరి ఆచారిగారు, పెళ్ళకూరు, కొత్తూరు గ్రామం, నాయుడుపేట దగ్గర - శ్రీస్వామివారు తనకు భౌతిక దర్శన మిచ్చిన విషయం ఇలా చెపుతున్నారు.

మా పెద్దమ్మ కుమారుడు భార్య మీద అలిగి వచ్చేసాడు. అతనికి అప్పుడప్పుడు మూర్ఛవస్తుంది. చెయ్యి కొంచెం అవిటి. శ్రీ వెంకయ్య స్వామి వారి వద్ద గొలగమూడిలో ఉండవచ్చని ఇచ్చటికి వచ్చి విచారించాను. ఎక్కడా ఆచూకీ లేదు. శ్రీ స్వామి వారి మందిరానికి

పడమటివైపు కట్టే బిల్డింగ్ దగ్గర చలిలో వణికిపోతూ పడుకున్నాను. "సరైన గుడ్డలు లేకుండా వణుకుతూ ఎందుకు పడుకున్నావు, ఆయన ఎప్పుడో ఇంటికి వెళ్ళాడయ్యా" అని ఎవరో చెపుతున్నారు, లేచి చూస్తే ఎవ్వరూలేరు. నేను ఇంటికి వెళ్ళిపోయాను. పోగానే నా భార్య "ఈ చలిలో పోయి వెతకడమెందుకు ఆయన ఎప్పుడో ఉదయాన్నే వచ్చేశాడు" అని చెప్పింది. గొలగమూడిలో శ్రీ వెంకయ్య స్వామి వారే అలా చెప్పారని అది మొదలు శ్రీ వారిని దర్శిస్తుంటాను.

మరొకసారి నేనే ఇంట్లో అందరిమీద విరక్తి కల్గి గొలగమూడి వచ్చేశాను. భజనమందిరంలో ఒక పెద్దాయన పాటలు పాడమంటే ఎంతో తన్మయంతో చాలాసేపు పాడాను. ఆ పెద్దాయనొచ్చి ఇక చాలు లేచిరమ్మని నన్ను మందిరంలోకి తీసుకవెళ్ళి ఒకటి తీపి మరియొకటి కారం గల ప్రసాదాలు పెట్టించాడు. అప్పుడు నేను "అయ్యా నేను ఇక్కడనే శాశ్వతంగా పాటలు పాడుకుంటూ ఉంటాను. నా బ్రతుకు ఇక్కడే కడతేరిపోతుంది" అన్నాను. "అందరూ అట్లాగే చెపుతారు. ఇక్కడ ఉండలేరు అన్నాడు. లేదండీ ఇక నేను పోను అన్నాను. "సాయంకాలం 4 గంటలకు నీ కొరకు మనిషి వస్తాడు నీవు వెళ్ళిపోతావు. మనకు వాదనెందుకు నీవే చూడు" అన్నారు. నేనెవ్వరికీ కనబడకూడదని మందిరానికి పడమటనున్న రోడ్డులోకి వెళ్ళి, అక్కడకూర్చొని పడమటవైపు చూస్తున్న మనుషుల ప్రక్కనే తూర్పువైపు చూస్తూ కూర్చున్నాను. ఆ క్షణంలో నేనెవ్వరికీ కనబడకూడదు అనే మాట పూర్తిగా మరచిపోయాను. వాళ్ళు నావైపు తిరిగి ఇడుగోనయ్యా ఇక్కడే ఉన్నాడు అంటూ నా చెయ్యి పట్టుకొని నాలుగు చీవాట్లు పెడుతున్నారు. ఇంతలోనే బస్సు వచ్చింది. బలవంతంగా బస్సెక్కించారు. గంట సరిగ్గా 4 అయింది. నాకు ప్రసాదాలు పెట్టించి 4 గంటలకు పోతావని చెప్పిన పెద్దాయన శ్రీ స్వామివారుగాక మరెవ్వరు? హే కరుణామయా నిరతము నీ స్మరణ చేయు భాగ్యమియుమయా!



## శ్రీ K.శేషాద్రి గారు విద్యానగర్ సాయిమందిరం ట్రెజరర్ ఇలా వ్రాస్తున్నారు.

ఒకరోజు శ్రీ స్వామివారి సన్నిధికి గొలగమూడి వచ్చాను. అక్కడ కూర్చోగానే దివ్యమైన ధ్యానాన్ని ప్రసాదించారు. ఎంతో ప్రశాంతి అనుభవించాను. ఆ శాంతి అనుభవించవలెనే కానీ వ్రాయనలవికాదు. కనులు తెరచి శ్రీ స్వామికి ఇలా విన్నవించాను. స్వామీ మీ కృపకు చిహ్నంగా ఏదైనా ప్రసాదంగా ప్రసాదించండి. తమరు అలా ప్రసాదించక పోయినా నేనేమీ బాధపడను అనుకొని అక్కడ కూర్చొనున్నాను. పూజారి వచ్చి ఒక భోజన టిక్కెట్టు చేతిలో పెట్టి భోం చేయమన్నారు. అతను మందిరం తెరవేసి తిరిగి నా దగ్గరకొచ్చి ఒక రోజా పువ్వు నాచేతిలో వేసి వెళ్ళాడు. నా వినయపూర్వక ప్రార్థన అలా తీర్చారు. మందిరం బయటకు వస్తుంటే "కష్టం ఎంత అనుభవిస్తే అంత మంచిదిగదయ్యా" అన్న శ్రీ స్వామివారి మాటపై నా మనసుపడి - ఆ మాటనే మననం చేస్తూ పోతున్నాను. నా మోటర్ సైకిల్ టాంక్ నిండా ఆయిల్ ఉందనుకున్నాను. కానీ, అరఫర్లాంగుపోగానే బండి ఆగిపోయింది. టాంక్‌లో ఒక్క బొట్టు ఆయిల్ లేదు. వెనక్కు వచ్చి సుబ్బరామయ్య గారింట్లో బండిపెట్టి రేపు ఆయిల్ తెచ్చి తీసుకపోవచ్చనే ఆలోచన వచ్చింది. వెంటనే కష్టం ఎంత అనుభవిస్తే అంత మంచిదిగదయ్యా అన్న శ్రీ స్వామివారి మాట మరలా మరలా గుర్తురాసాగింది. కష్టపడడమే మంచిదని బండి నడిపించుకొని ముందుకే పోతున్నాను. రాత్రి 11 గంటల టైంలో ఏమీ జంకకుండా ముందుకే నడుస్తున్నాను. నాలుగు కిలోమీటర్లు పోయాక కొండాయపాళెం మధ్యలో పోతున్నాను. ఒకతను మోటర్ సైకిల్ మీద నాముందే తారు రోడ్డు క్రాస్ చేసి మట్టిరోడ్డు మీద పదిబారలు వెళ్ళి తిరిగి వెనక్కు వచ్చి ఏమి సార్ బండి ఉండి నడుస్తున్నారు, అన్నాడు. ఆయిల్ లేదండీ అన్నాను. గంట రాత్రి ఒంటి గంట కావస్తుంది. డబ్బా ఉందేమోనని

నన్నేగాక సమీపంలో నిద్రిస్తున్నవారిని లేపి అడిగినా దొరకలేదు. అతడు మరొకరిని బాగా శబ్దం చేసి లేపి డబ్బా తెచ్చి - మీరెక్కడికి పోవాలి. ఈ పెట్రోలుతో పెట్రోలు బంకు వరకు వెళ్ళవచ్చు అంటూ కొంత ఆయిల్ పోశాడు.

శ్రీ స్వామివారు ఎంత కరుణామయులో చూడండి. కష్టం ఎంత అనుభవిస్తే అంత మంచిదనే వాక్యంపై నా మనస్సు కేంద్రీకరింప జేయడం. వెనక్కు తిరగకుండా ముందుకే నడిపించి శ్రీ స్వామి వారిపై ఏ మాత్రం కష్టపడకుండా పోతుంటే - నేను అడగకుండానే నన్ను దాటి వెళ్ళిన వ్యక్తి తిరిగి వెనక్కు వచ్చి రాత్రి ఒంటి గంట ప్రాంతంలో తన బండిలోని పెట్రోలు ఇవ్వడం అంటే లోతుగా యోచిస్తే తెలుస్తుంది. వారి కరుణ ఎంత గొప్పదో!

వారి మాటపై లక్ష్యముంచిసాగితే ఎంతగా ఆదుకుంటారో! వారి స్థితి ఎలాంటిదై ఉండాలి. కేవల చైతన్యమేగదా. నిర్గుణం, నిర్మలం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనమైన ఆ చైతన్యమే మానవులపై కరుణతో మానవరూపం దాల్చి సద్గురువుగా ఉంటూ రెండు స్థితులలోనూ ఉండగల మహనీయుడన్నమాట. శ్రీ మాష్టారు చెప్పినట్లు గడపలో నిల్చున్న మనిషిలాంటివారు. బయటా లోపలా రెండుచోట్ల ఏమున్నాదో చూడగలవారు. మనమంతా అట్లా బయటో లోపలో ఏదో ఒకచోట మాత్రమే ఉంటాము. వారెంతో గొప్ప సద్గురువు కానిదే అందరి హృదయాలను ప్రేరేపించగల స్థితిలో ఉండలేరు. వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది అన్న శ్రీ స్వామివారిమాట అక్షర సత్యమేగదా! శ్రీ సాయిమందిర సేవకుని శ్రీ వెంకయ్యస్వామివారు అనుగ్రహిస్తున్నారంటే అంతరంగికంగా ఆ మహనీయులంతా ఒక్కటే అన్న శ్రీ మాష్టారిమాట పరమ సత్యమని తెలుస్తుంది.



నాపేరు ధనలక్ష్మి. మాది గుంటూరు. 1998 సం॥లో నాకు ఆరోగ్యం బాగుండటం లేదు. ఆకలి ఉండేది కాదు, నిద్ర పట్టేది కాదు, డొక్కలో నొప్పి, గుండెల్లో నొప్పి, వెన్నుపూస నొప్పి, రోజురోజుకీ నాలో నీరసం ఎక్కువ అయింది. ఆ సమయంలో దేవతలందరిని ప్రార్థించే దానిని. నా ఆరోగ్యం కాపాడమని నాలో ఉన్న ఈ బాధలన్నీ తగ్గించమని. నాకు ముగ్గురు కుమార్తెలు, వారికి నన్ను దూరం చేయవద్దని ముక్కోటి దేవతలరా నన్ను కాపాడండీ అని నా ముగ్గురు పిల్లలను దగ్గర పెట్టుకొని గొల్లు, గొల్లు మని పెద్ద పెద్దగా ఏడ్చాను. అయినా ఫలితం లేదు. ఆఖరికి చర్చికి కూడా వెళ్ళాను. అయినా నా బాధ తగ్గలేదు. అలా 15 రోజులు బాధపడ్డాను. ఇక నా పరిస్థితి ఆందోళనగా ఉంది. నేను ఈ బాధ పడలేను, చనిపోదాము అనిపించేది. నా మనసులో ఎన్నో ఆలోచనలు ఒక్కొక్కసారి బావిలో దూకి చనిపోదాము అనిపించేది. ఈ విధంగా నేనుండగ, పెదనాన్న గారి కుమారుడు రామారావు, ఆయన భార్య రమణ నాకు అన్నయ్య, వదిన వారిద్దరు ఇలా చెప్పారు. మీ అన్నయ్యకు ఆరోగ్యం బాగుండకపోతే ఎవరో చెప్పగావిని వెంకయ్యస్వామి, గొలగమూడి గుడి తెలియకపోయినా మేము తెలుసుకొని ఇద్దరము అర్థరాత్రి పూట వెళ్ళి స్వామిని దర్శించుకొని ప్రదక్షిణలు చేసి స్వామి కృపను పొందాము. పొట్ట ఉబ్బి వారము అన్నం, నీరు, నిద్రలేక ఎంతో బాధపడ్డ మీ అన్నయ్య స్వామిని దర్శించుకొని మూడు నిద్రలు చేసి వచ్చిన తర్వాత అంతా తగ్గిపోయి వెంటనే ఎంతో శక్తి వచ్చి ఆఫీసుకు వెళ్ళాడు. అంత సత్యం గల తండ్రి శ్రీ శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి అని చెప్పి, నీవు వెంటనే వెంకయ్య స్వామి గుడికి బయలుదేరమని, మేము తీసుకువెళతాము. మీరు, మీ భర్త ఇరువురిని బయలుదేరమని చెప్పినారు. వెంకయ్యస్వామి పుస్తకమిచ్చి రోజు స్వామి పుస్తకం చదువుకోమని, స్వామి పూజ చేయమని చెప్పినారు. నేను, అలాగే స్వామి వారి పుస్తకం చదువుకొని పూజ చేసుకున్న తర్వాత అన్నయ్య, వదిన,

నేను, మావారు సాంబశివరావు గొలగమూడి వెంకయ్యస్వామి దగ్గరకు బయలుదేరాము. గొలగమూడి బయలుదేరేముందు తెల్లవారుఘామున వాంతులు, గుండెలో నొప్పి, వెన్నుపూస నొప్పిగా ఉంది. స్వామి వారి దగ్గరకు వస్తానని అన్నయ్య, వదినలతో చెప్పాను గదా! రైలు బండిలో కూర్చోగలనా, అంతదూరం వెళ్ళగలనా అని మనసులో అనుకున్నాను. స్వామి! అంతా భారం నీదేనని అనుకొని తెల్లవారుఘామున శనివారం బయలుదేరాము. తెనాలిలో దిగి హోటల్‌కు వెళ్ళాము. ఒక్క ఇడ్లీ కూడా తినలేకపోయాను. అలా ఉంది నా పరిస్థితి. తర్వాత మరల రైలు ఎక్కి కూర్చొన్నది మొదలు నాలో నీరసం తగ్గి ప్రయాణం బాగానే చేశాను. గొలగమూడి వెంకయ్యస్వామి దగ్గరకు వెళ్ళగానే స్వామి భోజనానికి వెళ్ళాము. ఒక్క ఇడ్లీ కూడా తినలేని నేను స్వామి భోజనం తినగలిగాను. తర్వాత స్నానం చేసి నేను మావారు 128 సార్లు ప్రదక్షిణం చేశాము, చూశారా! స్వామి వద్దకు వెళ్ళేముందు ఎంత నీరసంగా ఉన్నానో, అంత నీరసము స్వామిని దర్శించగానే మాయమై 128 ప్రదక్షిణలు చేయగలిగాను. శనివారం స్వామి వారి "పల్లకి" సేవ అయిపోయిన తర్వాత తెల్లవారుఘామున నాకు చాలా నీరసం వచ్చింది. స్వామి వారి ముందు పడుకొని స్వామి! నాలో జీవం లేదు, నాకు బాధలన్నీ తీసి వేసి మంచి ఆరోగ్యాన్ని ఇవ్వు స్వామి అని చెప్పి ఎక్కి ఎక్కి ఏడ్చాను. తరువాత హోమగుండం చుట్టూ తిరిగి నా బాధనంతా మొరపెట్టుకున్నాను. అలా మూడు నిద్రలు చేసి ఇంటికి వచ్చాను. వచ్చిన వారం రోజులు నీరసంగానే ఉంది. ఆ తరువాత నాకు స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నేను గొలగమూడి వెళ్ళి గుడిలో కూర్చున్నట్లు అప్పుడు స్వామి వారి శిష్యులు ఇద్దరు ఆడవారు దారం చేతిలో పట్టుకొని త్రిప్పుతూ వెళుతుండగా నేను చూచి ఏమిటమ్మా ఆ దారం అని అడగగా అప్పుడు వారిద్దరు ఇది వెంకయ్యస్వామి వారి దారం, చేతికి కట్టుకుంటే ఎంతో మంచిది అన్నారు. నీవు మీ వాకిట బయట, తెలుపు, ఎరుపు నీళ్ళు



వారబోయ్యమని చెప్పి మాయమయ్యారు. నేను అలాగే చేశాను. నాలో క్రమేపి నీరసం తగ్గి ఒంట్లో హుషారు వచ్చింది. వెంటనే మరలా వెంకయ్యస్వామి వారిని దర్శించుకున్నాను. మరలా ఒకరోజు స్వామివారు కలలోకి వచ్చి నేను గొలగమూడిలో ఉన్నట్లు స్వామి వారు తెల్లటి దుస్తులతో పంచె, కండువ వేసుకొని ఎడ్ల బండిలో కూర్చోని గుడి ముందు నుండి వెళ్ళుచుండగా నేను, ఇంకా చాలామంది భక్తులు స్వామివారి బండి వెనుక వెళ్ళడం స్వామివారు ఒక గదిలో తల క్రింద చేయి పెట్టుకొని పడుకొని మమ్ములందరిని చూచి చిరునవ్వుతో ఆశీర్వదించినట్లు నేను స్వామి వారిని చూచి తన్మయత్వం చెంది ఆనంద బాష్పాలతో ఉండగా స్వామివారిని శిష్యులు స్నానానికి తీసుకెళుతున్నట్లు స్వామివారు కొంతదూరము వెళ్ళగా నేను లేచి స్వామిని చూడగా స్వామివారు కొంచెం దూరం వెళ్ళి వెనుదిరిగి నావంక చూచినట్లు నాకు స్వప్నం వచ్చింది. తరువాత స్వామి వారి చరిత్ర పారాయణ చేసినాను. స్వామీ నీవు బ్రతికి ఉన్న రోజుల్లో నాకు తెలియదు, తెలిసి ఉంటే నీ పాదాలు పట్టుకొని, నీ మాటలు విని నేను ధన్యురాలు అయ్యేదానను. ఇప్పుడు నీవు లేవు, నాకు ఆ భాగ్యము లేదు అని బాధపడ్డాను. వారము తరువాత స్వప్నంలో స్వామివారు గొలగమూడిలో నీళ్ళ తొట్టికాడ నుంచొని ఉండడం నేను స్వామి వారి వద్దకు వెళ్ళి నిలబడడం, ఏంటమ్మా అని స్వామివారు అనటం, నేను స్వామివారి పాదములు పట్టుకొని ఆనంద బాష్పములతో ఎంతో ఆనందపడ్డాను. స్వామివారి పాదములు మెత్తగా తగలడం స్వామి! నా కోరిక ఈ విధంగా తీర్చారా! మీరు చాటుకు వెళ్ళిన తరువాత కూడా భక్తుల కోర్కలను ఈ విధంగా తీర్చుచున్నారా! స్వామి, అని నా మనస్సులో ఎంతో ఆనందపడి నా జీవితం ధన్యం అయింది స్వామి అనుకున్నాను. చూచారా! స్వామివారు ఎంత మహనీయులో ఎంత త్యాగమూర్తో! ఎంత కరుణామయుడో ఈ పాటికి మీకే అర్థమయి ఉంటుంది. నేను ప్రతి 6 నెలలకొకసారి స్వామి వారిని దర్శించుకొంటూ

స్వామి వారి కృపకు పాత్రురాలని అయ్యాను. అలా స్వామి నా ఆరోగ్యాన్ని కాపాడి అడుగడుగునా మమ్ము మా కుటుంబాన్ని రక్షిస్తున్నారు. నా ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగుంది. నాటి నుండి నేటివరకూ ఏ బాధలేదు. ఎప్పుడైన ఒంట్లో బాగుండకపోతే స్వామివారిని తలచుకొని స్వామివారి నూనె రాసుకుంటే ఏ బాధ అయినా తగ్గిపోతుంది. మా ఇంట్లో మా పెద్ద అమ్మాయి, 2వ అమ్మాయి గ్రంధ పారాయణ 15 రోజులుచేసి ఆఖరిరోజున అన్నీ వండుకొని పూజ చేసి స్వామి! నీవు వచ్చి భోజనము చేయాలి. నీ రాక కోసము ఎదురు చూస్తాము, అని స్వామి ముందర కూర్చొని అనుకొనుచుండగా ఎప్పుడూరాని సాధువు వచ్చి భోజనము చేసి మా కుటుంబంలో అందరిని ఆశీర్వదించి వెళ్ళినారు. 3వ అమ్మాయి కూడా స్వామి వారి పూజ చేస్తుంది. మా కుటుంబంలో అందరమూ స్వామి వారిని నమ్ముకున్నాము.

మా పెద్ద కుమార్తెకు వివాహం అయ్యి 3 సంవత్సరములైనా సంతానము కలగలేదు. అప్పుడు నేను, నా కూతుర్ని, అల్లుడుని వెంకయ్యస్వామి గుడికి తీసుకెళ్ళి స్వామి వారి గుడి చుట్టూ 108 సార్లు ప్రదక్షిణలు చేయించి తులసమ్మ తల్లి చెట్టుకు ఊయల కట్టించినాను. సంతానము ఇవ్వమని స్వామివారిని వేడుకొని వెళ్ళాము. మరల నేను ఆరు నెలలకు గొలగమూడికి వెళ్ళాను. స్వామి గుడి చుట్టూ తిరుగుతూ ఏంటీ స్వామీ! నా కుమార్తెకు ఇంకా సంతానం ఇవ్వలేదు, అని బాధపడుతూ తిరిగుచుండగా మా పిన్ని ఒంటిమీదకు స్వామి వారు వచ్చి ఏంటమ్మా! బాధ పడుచున్నావా, నీ కుమార్తెకు నాగదోషము ఉన్నది. నేను నాగయ్యతో మాట్లాడుతానులే. నీ కుమార్తెను తొమ్మిది శనివారాలు పూజచేసి, ఒకపూట భోజనం, నేల మీద పడక చేయమను. తప్పకుండా సంతానం ఇస్తానని స్వామివారు చెప్పినారు. నేను, స్వామివారు చెప్పిన విధంగా నా కుమార్తెకు చెప్పినాను. స్వామివారు చెప్పినవిధంగా



శనివారములు చేయుచుండగా ఏడవ శనివారముకే నా కూతురు నెల తప్పింది. తొమ్మిది శనివారాలు నా కూతురు పూర్తి చేసినది. తర్వాత డాక్టరు దగ్గరకు వెళ్ళి పరీక్ష చేయించుకున్నది. డాక్టర్లు గర్భిణి కాదన్నారు. అప్పుడు నేను, మా ఇంట్లో అందరము చాలా బాధ పడ్డాము. నా కూతురు బాగా ఏడ్చింది. నేను స్వామి పటము ముందర కూర్చొని స్వామి! నీవు ఆడిన మాట తప్పవు, సంతానం ఇస్తానని చెప్పినావు. డాక్టర్లు ఈమె గర్భిణి కాదన్నారు. ఎందుకు ఇలా చేశావు స్వామి అని నేను ఏడ్చి ఏడ్చి పడుకున్నాను. మూడు రోజుల తరువాత నాకు స్వప్నంలో స్వామి వారు నా ఎదుట నుంచొని ఉన్నట్టు, స్వామి వారి ప్రక్కన ఒక ఆడమనిషి తెల్లటి చీర కట్టుకొని, వెంట్రుకలు విరబోసుకొని ఉన్నది. అప్పుడు స్వామివారు ఆ ఆడమనిషిని ఒక్కవేటున మూడుముక్కలుగా నరికి వేసినాడు. నన్ను పిలిచి నా చేతిలో ఒక పండును పెట్టి స్వామివారు అదృశ్యమైనారు. తెల్లవారిన తర్వాత నాకు వచ్చిన స్వప్నం గురించి అంతా మా యింట్లో వారికి చెప్పినాను. స్వామి నీకు ఉన్న పీడను తొలగించి పండును ఇచ్చినాడు, నీవు తప్పకుండా గర్భిణివి అని నా కుమార్తెకు చెప్పినాను. డాక్టర్లు గర్భిణి కాదన్నారు కదా, అని అన్నది. తరువాత నుంచి వాంతులవ్వడము మొదలయ్యాయి. అప్పుడు మరో డాక్టరమ్మ దగ్గరకి వెళ్ళి పరీక్ష చేయించినాను. అప్పుడు ఆమె పరీక్ష చేసి గర్భిణి అని చెప్పింది. మా సంతోషానికి అవదులు లేవు. ఆ సంతోషంతో డాక్టరమ్మతో ఇది అంతా స్వామి వారి కృపని వెంకయ్యస్వామే నా కుమార్తెకు సంతానం ఇస్తున్నాడని స్వప్నంలో జరిగిన వృత్తాంతము డాక్టరమ్మతో చెప్పాను. ఆమె కూడా సంతోషపడెను. చూచారా! స్వామి వారు ఆడినమాట ఎలా నిలబెట్టుకున్నారో. ఈ పాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది. నా కుమార్తె ప్రసవించింది. ఆడపిల్ల పుట్టినది. తల్లి, బిడ్డ క్షేమముగా ఉన్నారు. మగ పిల్లవాడు అయితే హరిత్ అని పేరు పెడదాము అనుకొన్నాను. ఆడపిల్ల కాబట్టి "అర్చన తులసి భవాని" అని పేరు

పెట్టుకున్నాము. స్వామివారు నా బాధలన్నీ తొలగించి నన్ను బ్రతికించడమే కాక నా కుమార్తెకు కూడా సంతానము ఇచ్చినాడు. స్వామివారికి ఏమి ఇచ్చినా ఋణం తీర్చుకోలేము. ఆ దయాసాగరునికి మా కుటుంబం అంతా ఆజన్మాంతము ఋణపడి ఉంటాము.

## రాబోయే ఆపదను పిలువకనే శ్రీ స్వామి రక్షించడం

మేము శ్రీ వెంకయ్యస్వామిని నమ్ముకున్నాము. ఆ కారుణ్యమూర్తి మమ్ములను ఎన్నో ఆపదలనుండి రక్షించినారు.

2003వ సం||లో వచ్చిన గోదావరి పుష్కరములకు మాఅమ్మగారు, నాన్నగారు మా బంధువులతో కలసి వెళ్ళుటకు నిశ్చయించుకున్నారు. ప్రయాణమవవలసిన రోజున నేనే మా అమ్మగారి బ్యాగ్‌లో బట్టలు మరియు ఇతర వస్తువులు సర్దితిని. అప్పుడు ఉదయం 10 గంటలు అయి ఉంటుంది. అంతవరకూ బాగానే ఉన్న నాకు ఉన్నట్టుండి విరోచనాలు, వాంతులు మొదలు పెట్టినాయి. చాలా ఎక్కువగా అయ్యి నాకు సెలైన్ కట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. నాకు ఇంట్లోనే సెలైన్ కట్టించినారు. ఇంతలో మా బంధువులు బస్టాండ్‌కు రమ్మని ఫోన్ చేశారు. నా పరిస్థితి గురించి విని అయితే మీరు తర్వాత రండి మేము వెళతాము అని చెప్పారు. కానీ నేను మాత్రం మా అమ్మగారిని, నాన్నగారిని వెళ్ళమని ఒత్తిడి చేశాను, ఎందుకంటే సెలైన్ కట్టిన తర్వాత నాకు బాగానే ఉంది. కానీ మా అమ్మగారు మాత్రం స్వామి వద్దని చెప్తున్నారు, లేకుంటే ఇప్పటివరకూ బాగానే ఉన్న నీకు ఉన్నట్లుండి ఇలా కావడమేంటి. స్వామి వద్దన్నారు కనుక వెళ్ళనన్నారు. అంతటితో పుష్కరయాత్ర ఆగిపోయింది. నేను మాత్రం నా వలన వాళ్ళ యాత్ర ఆగిపోయిందని బాధపడినాను. వారం రోజుల తర్వాత మాకు తెలిసిన వార్త ఏమిటంటే పుష్కరములకు



వెళ్ళిన మా బంధువులు ఆటోలో వెళ్తుండగా ఆటో బోల్తాపడి వాళ్ళకు బాగా దెబ్బలు తగిలాయి. ఒకరికి చెయ్యికూడా విరిగింది. వాళ్ళు హాస్పిటల్‌లో ఉన్నారని తెలిసింది. అదే మా అమ్మ, నాన్న కూడా ఉండి ఉంటే వాళ్ళకు కూడా అలాగే అయి ఉండేది కదా! కరెక్టుగా బయలుదేరవలసిన టైంలో అలా అవడం, తర్వాత బాగానే ఉండడం స్వామి లీల కాదంటారా?

సి.హెచ్. శ్రీదేవి - పొదిలి.

## అశ్వారావు పేట, అత్యం వెంకటేశ్వరరావు ఇలా వ్రాస్తున్నారు.

నేను 10-07-2002 వ తేదీన ఒక మోటార్ సైకిలు ప్రమాదములో నా ఎడమకాలి తొంటి జాయింటు విరిగి ఐదు ముక్కలైంది. అదే రోజు రాత్రి పాల్వంచలోని సాయిసుధ ఆస్పత్రిలో జాయిన్ అయినాను. తెల్లవారి శ్రీ బాబాను మరిము శ్రీ వెంకయ్యస్వామి గారిని అనన్యముగా నాకు త్వరగా స్వస్థత చేకూర్చవలసినదిగా మౌనముగా ప్రార్థించాను. అదేరోజు నా కలలో శ్రీ బాబా గారు కనిపించి, నిరుత్సాహముగా "కాదు" అన్నట్లు రెండు చేతులు తిప్పినారు. నేను, నాకు విరిగిన కాలు అతుకుకాదని భయపడినాను. కానీ ఏది అయితే అది అవుతుందని డాక్టర్ల సలహా మేరకు ఆపరేషన్ చేయుటకు నిశ్చయించి, నా సర్వ భారమును శ్రీ బాబాగారిపై మరిము శ్రీ వెంకయ్యస్వామి పై వుంచుట జరిగినది.

15-07-2002 సాయంత్రం నాకు ఆపరేషను చేయుటకు నిశ్చయించినారు. ఆ రోజు ఎక్కువగా శ్రీ బాబాగారిని మరిము శ్రీ వెంకయ్యస్వామి వారిని మౌనముగా అనన్యముగా ప్రార్థించుచునే

యున్నాను. నాకు ఆపరేషన్ సమయంలో నడుము క్రిందవరకు మత్తు ఇచ్చినారు. నేను చాలాసేపు స్పృహలోనే ఉన్నాను. అప్పుడప్పుడు మత్తులో ఉంటూ ఉన్నాను. ఈ సమయములో ఆపరేషన్ మొదలైన కొద్ది సమయమైన తరువాత, నా ఆపరేషన్ టేబుల్ ప్రక్కనే, నా తల వద్ద గాలిలో శ్రీ వెంకయ్యస్వామిగారు కూర్చొని, నాకు త్వరగా తగ్గుతుందని ధైర్యము చెప్పారు. నేను క్రిందికి దిగి వారు కూర్చొనేందుకు కదులుతుండగా, అవసరం లేదని వారే చెప్పినారు. మరియు అదే సమయములో శ్రీ షిరిడిసాయి బాబాగారు, వారు చేతిలో కత్తెర తీసుకొని, ఏదో కత్తిరించుకుంటూ, ఆడుచూ వెళ్ళుచున్నారు. ఈ విధముగా ఆపరేషన్ పూర్తయిన 4 గంటలలో రెండు పర్యాయములు నాకు భౌతికముగా దర్శనాలు ప్రసాదించి, నాకు ధైర్యము చెప్పి, అభయమిచ్చిన శ్రీ వెంకయ్యస్వామిగారికి నేను పూర్తిగా రుణపడి యున్నాను. ఈ సమయములో శ్రీ వెంకయ్య స్వామివారు, మోచేతి వరకు వుండే చొక్కాను ధరించియున్నారు. ఒక చేతిలో తంబుర గలదు. నేను యిప్పటి వరకు చూచి వున్న, ఏ ఫోటోలోనూ కూడా యీ విధంగా మోచేతి వరకు తొడుగుకొనియున్న చొక్కాతో చూడలేదు.

ఇదే విషయము ఆపరేషన్ అయిన తరువాత, నేను బయటకు వచ్చి, బాధపడుచున్న నా భార్యతో చెప్పినాను. స్వామివారి ఆశీర్వచనం మరియు శ్రీ బాబా గార్ల అనుగ్రహముతో నేను మూడు నెలలకు నడవ వచ్చుని, డాక్టర్లు చెబితే, 2 నెలల 15 రోజులలోనే నడుచుట జరిగినది. ఆరు నెలల తరువాత మోటారు సైకిల్ నడపవచ్చుని చెబితే, 5 నెలల 15 రోజులకే నేను మోటరు సైకిల్ నడపగలిగాను. శ్రీ స్వామివారి ఋణం ఏ విధంగానూ తీర్చుకోలేను.



# శ్రీ సాయికి శ్రీ స్వామి వారికి భేదం లేదనే అనుభవం

M.భాస్కరరావు (చెన్నై) వారికి వివాహమై 12 సంవత్సరములు అయినా సంతానం కలగలేదు. డాక్టర్ల చుట్టూ తిరిగారు. ఎన్నో పరీక్షలు చేశారు. ఎవరిలో లోపంలేదు అయినా పిల్లలు ఎందుకు కలగటం లేదో అర్థంకాలేదు. చాలా బాధపడుతున్నారు. ఒకరోజు ఒక స్నేహితుడు కలసి వీరి బాధ విని సాయిబాబాకు మ్రొక్కుకో పిల్లలు పుడతారు అని చెప్పాడు. వీరికి సాయిబాబా అంటే మొదటినుంచి తెలవదు. వీరు వెంకటేశ్వరస్వామి భక్తులు. స్నేహితుడు చెప్పాక సాయిబాబా గుడికి వెళ్ళి నాకు సంతానము ప్రసాదించు స్వామీ నీ మందిరానికి 9 వారాలు వస్తాను అని మ్రొక్కుకున్నారు. ఒక వారం వెళ్ళారు. రెండవ వారానికే వీరి భార్యకు గర్భమని చెప్పారు. వీరికి ఒక పాప పుట్టింది. పాపకు సాయి అని పేరు పెట్టారు. తరువాత మరలా ఇంకొక పాప పుట్టింది. అప్పటినుంచి వీరు భరద్వాజ మాష్టారుగారు రచించిన పుస్తకాలు చదువుతూ పారాయణ చేస్తున్నారు. కొంతకాలానికి వీరి భార్యకు గర్భసంచిలో ఏదో అయింది, ఆపరేషన్ చెయ్యాలని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ చేస్తే చిన్న పిల్లలతో ఇబ్బంది అవుతుందని చాలా బాధపడుతున్నారు వీరి భార్య. తెల్లవారితే ఆపరేషన్, ఆ రాత్రి ఆమె స్వప్నంలో వెంకయ్యస్వామి వారి పూజ గదిలో కూర్చున్నారు. ఆమెకు వెంకయ్య స్వామి ఎవరో అర్థంకాక ఎవరు నువ్వు ఎందుకొచ్చావని గట్టిగా అరుస్తూ స్వామిని అడిగారు. అప్పుడు స్వామి ఊరికినే వచ్చానమ్మా ఏమీలేదమ్మా నన్ను తిట్టమాకు అని వెళ్ళిపోయారట. తెల్లవారి ఈ విషయం ఈమె భర్తకు చెప్పింది. వచ్చింది వెంకయ్యస్వామి అని ఆయనన్నారు. ఆ రోజు ఆపరేషన్‌కు హాస్పిటల్‌కు వెళ్ళారు. ఆపరేషన్ ముందు ఒక స్కానింగు చేయాలని అన్నారు. స్కానింగ్ చేస్తే అంతకుముందు కనిపించిన ప్రాబ్లమ్ ఇప్పుడు లేదేంటి అని

ఆశ్చర్యపోయారు డాక్టరుగారు. ఆపరేషన్ అవసరం లేదు, ఇంటికి వెళ్ళిపోండి అన్నారు. ఇదంతా స్వామి దయ అని వారు పరమానంద పడిపోయారు. మరలా కొంతకాలానికి మళ్ళీ ఈమెకు కిడ్నీలో ప్రాబ్లమ్ వచ్చింది. ఏ సంగతీ సరిగా చెప్పలేదు డాక్టర్లు. వారం వారం బాడీలోని బ్లడ్ అంతా బయటకు తీసి శుద్ధి చేసి మళ్ళీ ఎక్కించాలి. దీనికి చాలా ఖర్చు అవుతుంది. ఇలా చేస్తుంటే కొన్నాళ్ళు బ్రతకవచ్చు అన్నారు. బ్లడ్ తీసేటప్పుడు, ఎక్కించేటప్పుడు నరకం అనుభవించాలి. ఆమెకు పరీక్షలు చేస్తున్నారు. ఈయన బాధతో హాస్పిటల్‌లోనే బాబా, వెంకయ్యస్వామి ఫోటోలుపెట్టి అగరవత్తులు వెలిగించి అక్కడే పారాయణ ప్రారంభించారు. అది చూచి డాక్టర్లు ఏమిటయ్యా హాస్పిటల్‌ను గుడి చేసావేమిటి అని అడిగారు. అప్పుడు ఈయన మీ పని మీరు కానివ్వండి. నా పని నేను చూసుకుంటాను అని అన్నారు. పదిహేను రోజులు ఉంచాక పరీక్షలు అన్నీ అయ్యాక ఈమెకు ఏమీలేదు, బాగానే ఉంది అని అన్నారట. స్వామి ఎంత దయామయుడో చూడండి. ఇంతటి దయామయునకు ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియడం లేదు.

**టి.రంగబాబు, కల్పాకం, తమిళనాడు ఇలా వ్రాస్తున్నారు.**

రెండు సంవత్సరముల వయస్సుగల ప్రణీత్ అనే మా కుమారుడు జామకాయ తింటుంటే చిగుళ్ళ ద్వారా రక్తము వచ్చినది. ఆసుపత్రిలో చూపిస్తే మద్రాసు చైల్డ్‌ట్రస్టు ఆసుపత్రికి పొమ్మన్నారు. అక్కడ చూపిస్తే దీనికి ఎలాంటి మందూ లేదని ప్లేట్‌లెట్స్ మరియు రక్తము ఎక్కించడము మరియు స్టెరాయిడ్స్ మందులు వాడడం మొదలుపెట్టారు. ఆవిధముగా రెండున్నర సంవత్సరములు వాడారు. మందులు వాడినపుడు ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరుగుతుంది. మందులు ఆపేస్తే మరలా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిపోతుంది. ఎప్పుడైనా చిన్న గాయం తగిలినా ఎక్కువగా రక్తము చాలా సేపు కారేది. రక్తము అందరి గాయాలవలె గడ్డ



కట్టేది కాదు. ఈ స్టెరాయిడ్స్ అనే మందులు ఎక్కువ కాలము ఎక్కువ మోతాదులో వాడినందువలన రక్తము కక్కుతున్నాడు. జలుబు చేసినా, దగ్గినా రక్తము పడుతుంది. ఆక్యుపంక్చర్, ఆయుర్వేదము మొదలగు వైద్యాలెన్నో ప్రయత్నించాము. అట్లా నాలుగు సంవత్సరములు గడిచినది. ఒక లక్షా యాభైవేలు ఉండవలసిన ప్లేట్‌లెట్స్ సంఖ్య ముప్పైవేలు - అరవై వేలులోపుగానే ఉంది. ఏ వైద్యాలవల్లా నయం కావడం లేదు. 2004 జనవరిలో ముక్కునుండి ఎక్కువగా రక్తము కారుతుంది. అందువలన మద్రాస్ చైల్డ్‌ట్రస్ట్ ఆసుపత్రికి తీసుకొని వెళితే అక్కడకు వెళ్ళిన వెంటనే 1/2 లీటరు రక్తము కక్కుకున్నాడు. వాళ్ళు వెంటనే రాత్రికి రాత్రి రక్తము మరియు ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. ఇప్పుడు అరికాళ్ళు మంటలు, మోకాళ్ళు వాచి నొప్పులు మొదలైనాయి. డాక్టర్లు మోకాళ్ళ నొప్పులకు (ఆర్థ్రాయిటిస్) ముసలివారికి వాడే మందులు వాడాలన్నారు. దానిని నేను అంగీకరించలేదు.

మా స్నేహితుడు గొలగమూడికి వెళ్ళమని చెపుతున్నా పిల్లవాడు ఉండే ఈ అపాయ పరిస్థితులలో వైద్యసౌకర్యాలు లేని గొలగమూడికి వెళ్ళేందుకు ఆరు నెలలు జాప్యం చేశాము. పిల్లవానికి ఇంకా బాధలు ఎక్కువైనాయి. కొందరు డాక్టర్ల సలహామీద మానవ శరీరములో ఉండే స్ప్లీన్ అనే అవయవము తొలగించాలనదే కూడా ఆలోచిస్తున్నాము. విదేశీయుడైన ఒక డాక్టరు స్ప్లీన్ తొలగించవద్దని సలహా యిచ్చాడు.

అట్టి సంకట పరిస్థితులలో మా స్నేహితుని సలహాపై 22-04-04లో బిడ్డను గొలగమూడి తీసుకవచ్చాము. గొలగమూడి వచ్చేటప్పుడు బిడ్డను చేతులమీద ఎత్తుకొని కారులో కూర్చోబెట్టుకొని గొలగమూడి వచ్చాము. మోకాళ్ళ నొప్పులు, వాపుల వలన అప్పటికి రెండు నెలలుగా మా బిడ్డ మంచములోనే ఉన్నాడు.

చాలా చిత్రంగా రెండు నెలలుగా నడవలేని మా బిడ్డ చక్కగా నడవగలిగాడు. నేను, నా భార్య స్వామి వారి మందిరానికి నిత్యము 108 ప్రదక్షిణలు చేస్తూ అవధూతలీల పారాయణ చేస్తూ 3 రోజులు ఉండి ఇంటికి వెళ్ళాము. మా మిత్రుని సలహా మీద నలభై రోజులు గొలగమూడిలో ఉండాలని మే 1వ తేదిన వచ్చాము. మేము వచ్చిన 4 రోజులకు మా పిల్లవానికి స్వామి స్వప్నములో కనిపించి నీకు రెండు నెలలకు బాగవుతుంది అని చెప్పారు. నా భార్య రోజూ 108 ప్రదక్షిణలు చేస్తూ అవధూతలీల పారాయణ చేస్తూ పిల్లవాని చేత వీలైనన్ని ప్రదక్షిణలు చేయిస్తూ రెండు నెలలు గొలగమూడిలోనే ఉన్నాము. ఇప్పుడు బిడ్డకు ఏ బాధలు లేకుండా స్క్రీన్ తొలగించే పరిస్థితి లేకుండా శ్రీ స్వామివారే తప్పించారు. మోకాళ్ళ నొప్పులు కానీ, ఏ ఇతర బాధలు లేక హాయిగా స్కూలుకు పోతున్నాడు. కృతజ్ఞతతో నెలకొకసారి వచ్చి శ్రీ స్వామి వారికి 108 ప్రదక్షిణలు చేసి పోతున్నాము.

26-12-2004వ తేదీన కల్పాకంలో కూడా "సునామి" (సముద్రము పొంగడం) వచ్చి చాలా ప్రాణ నష్టము, ఆస్థి నష్టము జరిగినది. నేనుండే ఇంటి ప్రాంతములో 13 మంది చనిపోయారు. కరుణామయుడైన శ్రీ స్వామి వారు సునామికి రెండు రోజులు ముందు నా భార్యను, పిల్లవాడిని కొందరు స్నేహితులతో గొలగమూడికి రప్పించారు. సునామి రోజున నేనొక్కడినే కల్పాకంలో ఉన్నాను. నేను, మా కారు నీళ్ళలో కొట్టుకొని పోయాము. కారు మాత్రం ఒక చెట్టుకు ఇరుక్కొనిపోయింది. దైవవశాత్తు కర్రతుమ్మ చెట్టు యొక్క చిన్న కొమ్మ పట్టుకొని నేను ప్రాణాపాయం నుండి చిన్న గాయాలతో, మోకాలు ఎముక విరిగి బయటపడ్డాను. అదే నా భార్య, బిడ్డ ఇంట్లో ఉంటే ఏమయ్యేదో మీరే ఊహించండి. స్వామికి ఎలా కృతజ్ఞతలు తెల్పాలో తెలియడం లేదు.



గొలగమూడిలో అనేకమంది మోసగాళ్ళు
మీ బాధలు ఒక్క రోజులో పోగొడతామని ఆశ చూపి మోసగిస్తున్నారు.
ఇచ్చట శ్రీ స్వామివారిని తప్ప ఇతరులనెవ్వరినీ నమ్మవద్దు.

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు,
టు - ది రిసీవర్,
భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి హ్యూమానిటేరియన్ మిషన్,
గొలగమూడి - 524 321 అనే అడ్రసుకు పంపాలి.
వ్యక్తుల పేర్లతో పంపరాదు.

ఓపిక ఉన్నవారు
ఇందులో ఇచ్చిన అడ్రసులవారిని విచారించి
నిజం తెలుసుకోవచ్చు.
ఇవన్నీ అసత్యాలని చెప్పడం
త్రాగేనీటిలో విషం కలపడం వంటిదౌతుంది.

## మా ఇతర ప్రచురణలు:

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | మౌన బోధ | 1 రూ\|\| |
| 11. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 12. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 13. | బోధ యజ్ఞాయ నమ: | 1 రూ\|\| |
| 14. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 15. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 16. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 17. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 18. | ఆచార్య భరద్వాజ గారి సత్సంగము | ఉచితము |
| 19. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 20. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 21. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 22. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 23. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 24. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 25. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 26. | స్మృతిరహిత ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 27. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ\|\| |